teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

తీన్మార్ మెల్కొల్పు
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కొల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com

ములుగు | సంపుటి: 04 | సంచిక: 297 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | ఆదివారం 3 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## నేడే నీట్-యూజీ పరీక్ష



- పరీక్షకు హాజరుకానున్న 22.79 లక్షల మంది విద్యార్థులు
- కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలు
- 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్



## దేశవ్యాప్తంగా మార్మోగిన మొబైల్స్

- భయాందోళన చెందిన జనం
- ఇది కేంద్ర ప్రభుత్వ టెస్టింగ్ మాత్రమే

**న్యూ ఢిల్లీ, మే 02 (తీన్మార్ న్యూస్):**
దేశ వ్యాప్తంగా శనివారం ఉదయం 11:41 గంటలకు అన్ని మొబైల్స్ పెద్ద శబ్దంతో మార్మోగాయి. అన్ని ఫోన్లు ఒకేసారి సౌండ్ చేయడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. కొందరికి అసలు విషయం తెలియక భయాందోళన చెందారు. విద్యావంతులకు అసలు విషయం తెలియడంతో లైట్ తీసుకున్నారు కానీ సామాన్య ప్రజలు మాత్రం ఝలక్కు గురయ్యారు. అయితే అసలు విషయాన్ని కొస్తే భారత ప్రభుత్వం అన్ని మొబైల్స్‌కు ఎమర్జెన్సీ హెచ్చరికలు జారీ చేసింది. విపత్తు సమయంలో ఉపయోగపడేలా.. హెచ్చరిక సేవను పరీక్షించడానికి భారత ప్రభుత్వం శనివారం ఉదయం ఈ సందేశాన్ని పంపింది. సందేశంలో ఇలా ఉంది. భారతదేశం తన పౌరుల కోసం తక్షణ విపత్తు హెచ్చరిక సేవ నిమిత్తం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి - మిగతా 2లో

## బతుకమ్మ కుంట వివాదంపై హైడ్రా కమిషనర్ క్లారిటీ

- రికార్డుల ప్రకారం 10 ఎకరాల చెరువు
- పేదల ఇళ్లనే కూల్చుతున్నామనేది అవాస్తవం
- పెద్దోళ్లను వదిలేస్తున్నామనే ప్రచారాన్ని నమ్మొద్దు



**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**
బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. బతుకమ్మ కుంటలో అసలు చెరువు లేదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే.. సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ప్రకారం అక్కడ 10 ఎకరాల చెరువు ఉన్నట్లు స్పష్టంగా ఉందని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. వరదల నివారణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు హైకోర్టు తమకు అనుమతి ఇచ్చిందని ఆయన తెలిపారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను పాటిస్తూనే తాము ముందుకు వెళ్తున్నామని - మిగతా 2లో

## దేశీయ విమానయాన రంగంలో కీలక పరిణామం



- విమాన కార్యకలాపాలను తగ్గించే నిర్ణయంలో ఎయిర్ ఇండియా
- చమురు ధరల మంటతో కార్యకలాపాలకు బ్రేక్

## సర్వోదయ తెలంగాణే నా లక్ష్యం



- పాలక పక్షం, ప్రతిపక్షం అన్ని అంశాలపై మాట్లాడతాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై కవిత తీవ్ర విమర్శలు

## రుణమాఫీ చారాణ.. ఎగ్గొట్టింది బారాణ



- రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్

**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**
రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. - మిగతా 2లో

## త్వరలో పీఆర్సీ ఫిట్‌మెంట్‌పై నిర్ణయం

- ఫిట్‌మెంట్‌లో 5 డీఏల విలీనం
- 100 రోజుల్లో పెన్షనర్ల బిల్లుల క్లియరెన్స్
- జూన్ 2 నుంచి హెల్త్ కార్డులు
- నెలకు రూ.1,000 కోట్ల బకాయిల చెల్లింపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**
రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఫిట్‌మెంట్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాల(డీఏ)ను ఫిట్‌మెంట్‌లో విలీనం చేసి చెల్లిస్తామని తెలిపింది. శుక్రవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. మారం జగదీశ్వర్ చైర్మన్‌గా ఉన్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని జేఏసీ, ట్రెసాలతో పాటు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో గుర్తింపు ఉన్న సంఘాలు, ఉపాధ్యాయ, పెన్షనర్ల - మిగతా 2లో

## భేటీ కానున్న తెలంగాణ కేబినెట్

కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్



**తెలంగాణ బ్యూరో, మే 02 (తీన్మార్ న్యూస్):**
సోమవారం తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి మండలి సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోబోతోంది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, రైతుల అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే మరికాసేపట్లో ప్రభుత్వ అధికారుల సంఘం నేతలతో సీఎం భేటీ కాబోతున్నారు. దీంతో ఎల్లుండి జరగబోయే కేబినెట్ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులకు భారీ తీపి కబురు ఉండబోతోందా అనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక ప్రకటన

## ఎండల వేళ ఐఎండీ చల్లని కబురు

- ముందే రానున్న నైరుతి రుతుపవనాలు
- ఈసారి సగటుకన్నా ఎక్కువే వర్షపాతం
- మే చివరి నాటికి తగ్గుముఖం పట్టనున్న ఎండలు



**తెలంగాణ బ్యూరో, మే 02 (తీన్మార్ న్యూస్):**
రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ తీవ్రతకు బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్న పరిస్థితులు. అయితే, ప్రస్తుతం మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వచ్చే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈనెల 14 నుంచి 16 తేదీల మధ్య ఇవి అండమాన్ నికోబార్ దీవులను తాకొచ్చని పేర్కొంది. ఆ తరువాత కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల గుండా దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు - మిగతా 2లో

## త్వరలో పీఆర్సీ ఫిట్‌మెంట్‌పై నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

సంఘాలు, ఆహ్వానిత సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు పీఆర్సీ ఫిట్‌మెంట్, డీఏల విడుదల సహా తమ డిమాండ్లను భట్టి విక్రమార్కకు వివరించారు. 63 అంశాలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన భట్టి.. రెండో పీఆర్సీ చైర్మన్ శివశంకర్ నుంచి నివేదిక తెప్పించుకుని, పరిశీలిస్తామని.. తర్వాత మరోసారి ఉద్యోగ సంఘాల నేతలను పిలిపించి మాట్లాడుతామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను పీఆర్సీ ఫిట్‌మెంట్‌తో విలీనం చేసి చెల్లిస్తామన్నారు. పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.6,000 కోట్ల బిల్లులను ఏకమొత్తంలో 100 రోజుల్లో చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.1,000 కోట్ల చొప్పున విడుదల చేస్తామన్నారు. జూన్ 2 నుంచి ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులు జారీ చేస్తామని.. పథకం మార్గదర్శకాలను రూపొందించాల్సిందిగా వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ఇక సీపీఎ?సను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తేవాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా.. దీనిపై మరోసారి సంఘాల నేతలతో చర్చిస్తామని భట్టి తెలిపారు. ఉద్యోగుల 63 డిమాండ్లలో పాక్షికంగా పరిష్కరించిన 26 డిమాండ్లు, పెండింగ్‌లో ఉన్న 37 డిమాండ్లను జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టి.. 30 రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఈ సమస్యలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని, తర్వాత ఉద్యోగ సంఘాల నేతలతో మాట్లాడుతానని వివరించారు. 5న తలపెట్టిన నిరాహార దీక్షల నిర్ణయాన్ని విరమించుకోవాలని భట్టి కోరారు. తమపై ఉద్యోగుల నుంచి ఒత్తిడి ఉందని, సీఎంతో మాట్లాడి భేటీ ఏర్పాటు చేయించాలని ఉద్యోగ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత నిరాహార దీక్షలపై నిర్ణయించుకుంటామన్నారు.

## దేశీయ విమానయాన రంగంలో కీలక పరిణామం

**న్యూ ఢిల్లీ, మే 02 (తీన్మార్ న్యూస్):**

దేశీయ విమానయాన రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పెరుగుతున్న జెట్ ఇంధన ధరల ప్రభావంతో ఎయిర్ ఇండియా తన విమాన కార్యకలాపాలను తగ్గించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో అంతర్జాతీయ విమాన సర్వీసులను కోత పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో జెట్ ఇంధన ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. దీని ప్రభావం విమానయాన సంస్థలపై తీవ్రంగా పడుతోంది. ఈ పరిస్థితుల్లో అనేక అంతర్జాతీయ రూట్లు నష్టాల్లోకి జారడంతో, సేవలను తగ్గించడం తప్ప మరో మార్గం లేదని సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. సమాచారం ప్రకారం, ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ ఈ విషయంపై అంతర్గతంగా సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. జెట్ ఫ్యూయల్ ధరల పెరుగుదల, కరెన్సీ మార్పిడి రేట్ల మార్పులు, గగనతల పరిమితులు వంటి అంశాలు కంపెనీ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు, ముఖ్యంగా ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఇంధన ధరలు భారీగా పెరిగి, విమానయాన రంగానికి అదనపు భారం మోపుతున్నాయి. దేశీయంగా కూడా ఎయిర్ ఇండియా లాభాలపై ప్రభావం పడింది. ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, పెరుగుతున్న ఖర్చులను ఎదుర్కోవడం సంస్థలకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో సంస్థ తన కార్యకలాపాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక, ఈ నిర్ణయంపై ఎయిర్ ఇండియా తన సిబ్బందికి కూడా సమాచారం ఇచ్చి, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యతతో ముందుకు సాగాలని కోరినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో విమాన షెడ్యూళ్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## బెట్టింగ్ ముఠాలకు సైబర్ పోలీసుల షాక్

**181 సోషల్ మీడియా ప్రొఫైల్స్ తొలగింపు**

**సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్**



**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**

ఐపీఎల్ సీజన్‌ను అడ్డం పెట్టుకుని సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు షాక్ ఇచ్చారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ బెట్టింగ్ యాప్‌లు, నకిలీ పెట్టుబడి స్కీమ్‌లను ప్రమోట్ చేస్తున్న 181 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను పోలీసులు గుర్తించి, వాటిని తొలగించారు. వివరాల్లోకి వెళ్తే ఈ ఏప్రిల్ నెలలో సైబర్ క్రైమ్ యూనిట్ నిర్వహించిన ఆపరేషన్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుమారు 801 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను నడుపుతున్న 181 ప్రొఫైల్స్‌ను పోలీసులు గుర్తించారు. ఈ అకౌంట్స్ ద్వారా ఐపీఎల్ మ్యాచ్ అంచనాలు, భారీ బోనస్‌లు, రెఫరల్ కమిషన్ల పేరుతో అమాయకులను ఆకర్షిస్తున్నారు. చివరికి ప్రముఖ వ్యక్తుల ఫోటోలు, వీడియోలను 'డీప్‌ఫేక్' సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, వారు కూడా ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టమని కోరుతున్నట్లు జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఏప్రిల్ నెలలో మొత్తం 6 ఫ్‌ఐ= లు నమోదయ్యాయి. ఇప్పటివరకు మొత్తం మీద 427 ప్రొఫైల్స్, 1903 పెయిడ్ ప్రమోషన్లను సైబర్ పోలీసులు నెట్ నుంచి తొలగించారు. మిగిలిన అనుమానాస్పద అకౌంట్లపై కూడా దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే వాటిని బ్లాక్ చేయించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. తెలంగాణలో ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ పూర్తిగా నిషేధించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలను కోరారు. అనధికారిక బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే సోషల్ మీడియా ప్రకటనలను నమ్మవద్దని చెప్పారు. సెలబ్రిటీలు పెట్టుబడి స్కీమ్‌లను ప్రోత్సహిస్తున్నట్లు వచ్చే వీడియోల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు ఆన్‌లైన్ జూదం వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కి కాల్ చేయాలని లేదా ఒఒఒ.ఎఎవఎతిఒతిఒఎవ.వ్రతిజ.ఐఐ లో ఫిర్యాదు చేయాలని అన్నారు.

## సర్వోదయ తెలంగాణే నా లక్ష్యం

**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలంగాణ ప్రజల ముందుకు ఒక కొత్త రాజకీయ వేదికతో వచ్చారు. ప్రజల సమస్యలను ఎత్తి చూపే ప్రశ్నించే గొంతుకగా తన పార్టీ పని చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. పాలక పక్షం, ప్రతిపక్షం తేడా చూడకుండా అన్ని అంశాలపై మాట్లాడతామని ప్రకటించారు. జాగృతి చీఫ్‌గా కొనసాగుతుంది. ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టాలు ఎదురైనా తాను చెప్పిన మాట మీద, పట్టిన తోవ మీద నిలబడతానని కవిత అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందడుగు వేయాలని కవిత సూచించారు. "ధాన్యం కొనండి. రైస్ ఎగుమతి చేసే పరిస్థితి ఉంది. కార్పొరేషన్ పెట్టి ఎగుమతి చేయండి. రైస్ లైసెన్స్ తీసుకోండి" అని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుత పాలకులకు "అమ్మతనం" లేదని, అందుకే పరిపాలన సరిగా జరగడం లేదని విమర్శించారు. "అమ్మగా నేను ఉంటా" అని చెప్పినందుకు కొందరు అవాకులు చెవాకులు పేలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వోదయ తెలంగాణ సాధనే తన లక్ష్యమని చెప్పిన కవిత, 60 వేలకు పైగా భూ నిర్వాసితుల పక్షాన నిలబడతానని ప్రకటించారు. గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా చనిపోతున్న విషయంపై మండిపడ్డారు. విద్యాశాఖ సీఎం దగ్గరే ఉన్నా, సమీక్షలు కూడా చేయడం లేదని విమర్శించారు. వచ్చే రెండున్నరేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం పై కొట్లాడతానని హెచ్చరించారు. గ్రూప్–1లో అవినీతి జరిగిందంటే బుల్డోజ్ చేసి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ కాదు ఫ్యూచర్ లెస్ సిటీ. అదో రియల్ ఎస్టేట్ మాయ అని వ్యాఖ్యానించారు. మహిళలపై అత్యాచారాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక పెరిగాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం సెక్రటేరియట్‌కు రావడం లేదని, వాస్తు సమస్య ఉండవచ్చని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మంత్రుల ఇండ్లకు వెళ్లడం లేదన్నారు. బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు అనేక అవినీతి, అక్రమాలపై ఆధారాలు కేసీఆర్‌కు ఇచ్చానని, అప్పుడు ఆయన బాస్ కాబట్టి చెప్పిన పని చేశానని కవిత చెప్పారు. తల్లిదండ్రులను గౌరవిస్తానని, బీఆర్ఎస్ అధ్యక్షుడిగా మాత్రమే కేసీఆర్‌ను విమర్శిస్తానని స్పష్టం చేశారు. పది సార్లు పేపర్ లీకులు జరగడంపై కేటీఆర్‌ను ప్రశ్నించారు. విదేశాలు తిరిగే కేటీఆర్ పరీక్ష పత్రాలు లీక్ కాకుండా టెక్నాలజీ వాడలేరా.. అని నిలదీశారు. తెలంగాణ రక్షణ సేనను ఎన్నికల కమిషన్ గుర్తించినా, ఆ పేరు రానివ్వకుండా కుట్రలు జరిగాయని ఆమె ఆరోపించారు. ఆ కుట్రల నుంచి బయటపడటానికి కొన్ని టెక్నిక్స్ వాడాల్సి వచ్చిందని వెల్లడించారు. బీజేపీకి తెలంగాణలో స్పేస్ లేదని, ధర్మపురి అరవింద్ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌లో చాలా మంది చాలా మాట్లాడతారని, కానీ రాజకీయ పార్టీగా ఉండటమే పవర్ అని, తన పవర్ ఏమిటో కాలమే సమాధానం చెప్తుందని చెప్పారు. తన టార్గెట్ బీ ఆర్ ఎస్ కాదు, కాంగ్రెస్ కాదని, సర్వోదయ తెలంగాణకు అడ్డువచ్చే వారిని విమర్శిస్తానని కవిత స్పష్టం చేశారు.

## ప్రధాని సభ పేరు మార్పుపై పీఎంఓ జోక్యం

**మోదీ పర్యటన ముందు పీఎంఓ కీలక ఆదేశాలు**



**న్యూ ఢిల్లీ, మే 02 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అయితే, ఈసారి ఆయన పర్యటనకు ముందే ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని పాల్గొనే బహిరంగ సభ పేరు విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం జోక్యం చేసుకోవడం, రాష్ట్ర బీజేపీ ప్రతిపాదించిన పేరును మార్చాలని ఆదేశించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ తొలుత ఈ సభకు జనాగ్రహ సభ అని పేరు పెట్టింది. సాధారణంగా జనాగ్రహం అనే పదాన్ని రాజకీయ పోరాటాలు, నిరసనలు లేదా ప్రభుత్వ వ్యతిరేకతను వ్యక్తం చేసే సందర్భాల్లో వాడుతుంటారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాలపై ప్రతిపక్షాల తీరును నిరసిస్తూ బీజేపీ దేశవ్యాప్తంగా ఈ పేరుతో కార్యక్రమాలు చేపట్టింది. అయితే, ఈసారి మోదీ పర్యటన కేవలం రాజకీయ సభకే పరిమితం కాలేదు. ఆయన హైదరాబాద్‌లో సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఒక పక్క అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు, ఆగ్రహం అనే ప్రతికూల అర్థం వచ్చే పేరుతో సభ నిర్వహించడం సముచితం కాదని ప్రధానమంత్రి కార్యాలయం అభిప్రాయపడింది. సానుకూల దృక్పథంతో, అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఈ పేరు మార్పు తప్పనిసరి అయింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర బీజేపీ తక్షణమే స్పందించింది. అప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో జనాగ్రహ సభ పేరుతో పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచార చిత్రాలు సిద్ధమయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించి, కేవలం ప్రధాని మోదీ బహిరంగ సభగా వ్యవహరించాలని నిర్ణయించారు. కార్యకర్తలు ఇప్పుడు పాత పోస్టర్లను సవరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలావుంటే, మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీగా ఉండనుంది. మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రధాని మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణకు కేటాయించిన పలు ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4:00 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభకు సంబంధించి రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. బీజేపీ శ్రేణులు ప్రధాని ప్రసంగంపై ఆసక్తి తో ఎదురు చూస్తున్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే తెలంగాణపై భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సభ ద్వారా అటు అభివృద్ధిని, ఇటు రాజకీయ బలాన్ని చాటుకోవాలని బీజేపీ భావిస్తోంది. పరేడ్ గ్రౌండ్స్ సభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించి, దక్షిణ భారత్‌లో పార్టీ పట్టును నిరూపించుకోవాలని చూస్తోంది. పేరు మార్పు అనేది చిన్న పరిణామమే అయినప్పటికీ, అధికారిక పర్యటనల విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం ఎంత నిశితంగా వ్యవహరిస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ప్రధాని ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం చేసిన సాయంపై స్పష్టమైన ప్రకటనలు ఉండవచ్చని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి.

## దేశవ్యాప్తంగా మార్మోగిన మొబైల్స్

-మొదటిపేజీ తరువాయి

సెల్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రారంభించింది. పౌరులను అప్రమత్తం చేయడం. దేశాన్ని సురక్షితం చేయడం. ఈ సందేశాన్ని అందుకున్న తర్వాత ప్రజలు ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇది ఒక పరీక్షా సందేశం." అని భారత ప్రభుత్వం పేర్కొంది. ఇక కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో 2026 మే 2న మొబైల్ ఆధారిత విపత్తు సమాచార వ్యవస్థను ప్రారంభించారు. పౌరులకు కీలక సమాచారాన్ని సకాలంలో చేరవేసేందుకు, సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలికమ్యూనికేషన్ల విభాగం, భారత ప్రభుత్వ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సహకారంతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహాయ కమిషనర్లు/కార్యదర్శులు (విపత్తు నిర్వహణ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు, అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ మరియు హోం గార్డుల అధిపతుల 2026 వార్షిక సమావేశంలో అమిత్ షా సమక్షంలో ఈ పరీక్ష హెచ్చరిక సందేశం పంపబడింది. ప్రతి దేశంలోనూ విపత్తు లేదా క్లిష్ట పరిస్థితి సమయంలో ప్రభుత్వం పౌరులకు వీలైనంత త్వరగా సమాచారాన్ని అందించడానికి ప్రయత్నిస్తుంది. పౌరులను త్వరగా అప్రమత్తం చేయడానికి ఫోన్ మాత్రమే ఏకైక సాధనం. ఈ కారణంగా కష్ట సమయాల్లో ప్రజలను సకాలంలో అప్రమత్తం చేయడానికి వీలుగా భారత ప్రభుత్వం మొబైల్ ఆధారిత విపత్తు సమాచార వ్యవస్థను పరీక్షించింది.

## బతుకమ్మ కుంట వివాదంపై హైడ్రా కమిషనర్ క్లారిటీ

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే తొలగిస్తుందని, పెద్దవారిని వదిలేస్తుందని వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఈ ప్రచారంలో వాస్తవం లేదని, చట్టప్రకారమే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. హైడ్రా పేదల మీదకు వెళ్తుంది.. పెద్దోళ్లను వదిలేస్తుందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటి పుకార్లను ప్రజలు నమ్మొద్దని కోరారు. గతంలో హైడ్రా అనేక ప్రాంతాల్లో చెరువులను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. ఫలితంగా అనేక కుటుంబాలు నిలువనీడ లేకుండా రోడ్డున పడ్డాయి. ఈ క్రమంలో బడా బడా నేతలు, సెలబ్రిటీల జోలికి హైడ్రా వెళ్లబోదని, పేదలపైనే ఉక్కుపాదం మోపుతోందన్న ప్రచారం జోరుగా జరిగింది. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

**హైదరాబాద్, మే 02 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల (2026) ఫీజు చెల్లింపు గడువు విషయంలో తెలంగాణ ఇంటర్ బోర్డ్ కీలక అప్‌??డేట్ ఇచ్చింది. సప్లిమెంటరీ ఫీజు గడువును మే4వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు శనివారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ప్రకటన విడుదల చేశారు. తాజా ప్రకటన ప్రకారం ఆలస్య రుసుము రూ. 3000 చెల్లించి విద్యార్థులు మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్, సెకండ్ ఇయర్ రెగ్యులర్ విద్యార్థులతో పాటు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. సప్లిమెంటరీ పరీక్షలు మే 13 నుంచి మే 21 వరకు జరగనున్నాయి. థియరీ పరీక్షల అనంతరం మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. కాగా, ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను గత నెల 12వ తేదీన ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 75.34 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో 66.20 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు మొత్తం 4,89,123 మంది విద్యార్థులు హాజరుకాగా, సెకండ్ ఇయర్ పరీక్షలకు 4,53,932 మంది హాజరయ్యారు.

## నేడే నీట్- యూజీ పరీక్ష

**తెలంగాణ బ్యూరో, మే 02 (తీన్మార్ న్యూస్):**

దేశవ్యాప్తంగా ఆదివారం నీట్ – యూజీ పరీక్ష జరగనుంది. ఇందుకోసం ఎన్టీఏ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. నీట్ పరీక్ష జరగనున్న పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమల్లోకి రానుంది. తెలంగాణలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక నోటీస్ విడుదల చేశారు. నోటీస్ ప్రకారం.. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురికంటే ఎక్కువమంది ఉండకూడదు. గుంపులు గుంపులుగా ఉండకూడదు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. ఈ ఆదేశాలను ఉల్లంఘించినవారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జరిగే ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరు కానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగనుండగా విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. 1.30 గంటలకు ఎంట్రీ ఆపేస్తారు. అడ్మిట్ కార్డు, ఫొటోగ్రాఫ్ తప్పనిసరిగా ఉండాలని, వర్షాలు పడే అవకాశాలుండటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఏ సూచించింది.


## ఎండల వేళ ఐఎండీ చల్లని కబురు

-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం. దీంతో మేలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో మే నెలలో చివరి రెండు వారాల్లో ఎండల తీవ్రత తగ్గే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాల కారణంగా దక్షిణ రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. అయితే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పగటిపూట మాత్రమే కాదు.. రాత్రి సమయాల్లోనూ వేడి ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. సముద్రపు తేమతో కూడిన వేడిగాలి వల్ల ఎక్కువ ఉక్కపోత ఉండొచ్చని తెలిపింది.

## రుణమాఫీ చారాణ.. ఎగ్గొట్టింది బారాణ

-మొదటిపేజీ తరువాయి



శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడెక్కడో వెళ్లేవారు.. కానీ కొండపోచమ్మ వ

# అసెంబ్లీ ఎన్నికల్లో 200కి పైగా స్థానాల్లో గెలుస్తాం

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ(టీఎంసీ) 200 సీట్లకుపైగా గెలుచుకోవడం ఖాయమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే ప్రయత్నం తప్ప మరేమి కాదన్నారు. వారు, 2021, 2024లో అలాగే చేశారని, ఇప్పుడు మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. శనివారం వర్చువల్‌గా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలపై మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దౌర్జన్యాలకు పాల్పడ్డాయని అన్నారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో అవిశ్రాంత పోరాడిన తమ కార్యకర్తలకు మమత అభినందనలు తెలిపారు.



**‘దక్షిణ 24 పరగణాల జిల్లాలో రీపోలింగ్’**

మరోవైపు, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. రెండో దశ పోలింగ్ సందర్భంగా డైమండ్? హార్బర్? నియోజకవర్గం పరిధిలోని ఫల్తా ప్రాంతంలోని కొన్ని బూత్‌లలో బీజేపీ అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని బంగాల్ బీజేపీ సహ ఇన్‌ఛార్జి అమిత్ మాల్వీయా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం కొన్ని కేంద్రాల్లో మళ్లీ రీపోలింగ్ నిర్వహిస్తోంది. మగ్రహాట్ పశ్చిమ అసెంబ్లీ పరిధిలోని 11 పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు 72.5 శాతం పోలింగ్ నమోదైంది. డైమండ్ హార్బర్ అసెంబ్లీ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 72.36 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 72.43 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

**పోలింగ్ బూత్ సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో భద్రత**

రీపోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ బూత్ సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బందిని భారీగా మోహరించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. కోల్‌కతాలోని ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి కూడా పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నారు.

**ఆసక్తికర అంచనాలతో ఎగ్జిట్ పోల్స్ విడుదల**

ఇదిలా ఉండగా, బంగాల్ ఎన్నికలపై విడుదలైన పలు ఎగ్జిట్ పోల్స్ ఆసక్తికర అంచనాలను వెల్లడించాయి. ఎక్కువ సర్వేలు బీజేపీకి ఆధిక్యం ఉంటుందని అంచనా వేశాయి. చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం, 294 స్థానాలున్న బంగాల్ అసెంబ్లీలో బీజేపీ 150 నుంచి 160 స్థానాలు గెలుచుకుని మెజారిటీ సాధించే అవకాశముందని తెలిపింది. టీఎంసీకి 30 నుంచి 40 స్థానాలు, అలాగే, ఇతరులకు ఆరు నుంచి 10 సీట్లు మాత్రమే గెలుచుకుంటారని అంచనా వేసింది. అలాగే, బంగాల్‌లో బీజేపీకి 146–161 సీట్లు, టీఎంసీకి 125–140 స్థానాలు, ఇతరులకు 6 నుంచి 10 సీట్లు వచ్చే అవకాశముందని మాత్రిజ్? అంచనా వేసింది. జేవీసీ సర్వే ప్రకారం, బీజేపీ 138–159 స్థానాలు, టీఎంసీ 131–152 స్థానాలు, కాంగ్రెస్?కు రెండు ఓట్లు, వామపక్షాలకు ఒక్క సీటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది.

**‘సోమవారం కౌంటింగ్ ప్రక్రియ షురూ’**

కాగా, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్?కు ఇంకా ఒక్కరోజే సమయం మిగిలి ఉంది. సోమవారం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో బంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బంగాల్?లో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. అయితే రెండు దశల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్? నమోదు అయినట్లు ఈసీ పేర్కొంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బంగాల్‌లో ఇదే అత్యధిక పోలింగ్ శాతమని తెలిపింది. మొదటి దశలో 93.19 పోలింగ్? నమోదు కాగా, రెండో దశలో 91.66 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించింది.

# ‘ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్’

బంగాల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనే నియమించారని టీఎంసీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా లేదని అభిప్రాయపడింది. కేవలం కేంద్రప్రభుత్వ పూల్ నుంచే సిబ్బందిని ఎంచుకునే అధికారం ఈసీకి ఉందని సుప్రీం తెలిపింది. ఓట్ల లెక్కింపు సమయంలో టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారు కాబట్టి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని నియమించాలన్న ఈసీ నిర్ణయాన్ని టీఎంసీ అంతకుముందు కలకత్తా హైకోర్టులో సవాల్ చేసింది. వారిని సూపర్‌వైజర్లుగా, అసిస్టెంట్లుగా నియమిస్తే బీజేపీకి అనుకూలంగా పనిచేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించడంతో టీఎంసీ సుప్రీంను ఆశ్రయించింది. ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర అధికారులు ఉన్నా, మళ్లీ అదనంగా కేంద్ర సిబ్బందే ఎందుకని ప్రశ్నించింది. ఈసీ సర్క్యులర్ ప్రకారం రాష్ట్ర అధికారులను చేర్చుకోవాల్సి ఉన్నా, వారిని నియమించడం లేదని ఆరోపించింది. ఈ సమయంలో ఎన్నికల కమిషన్ న్యాయవాదులు స్పందించారు. ఓట్ల లెక్కింపుపై పూర్తి పర్యవేక్షణ అధికారం రిటర్నింగ్ అధికారికే ఉంటుందని, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని గుర్తుచేశారు. కాబట్టి టీఎంసీకి అనుమానం అవసరం లేదని ఈసీ కోర్టుకు తెలిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం, ఈసీతో ఏకీభవించింది.



**‘ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు’**

ఈ సందర్భంగా, ఎన్నికల సంఘం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది డీ.ఎస్. నాయుడు, రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని, ప్రభుత్వ ఉద్యోగులను ఏ విభాగం నుంచైనా సిబ్బందిని నియమించే అధికారం ఆయనకు ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని చెప్పారు. ప్రతి అభ్యర్థికి వారి స్వంత కౌంటింగ్ ఏజెంట్ కూడా ఉంటారని తెలిపారు. అలాగే, టీఎంసీ ఆందోళనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి బదులుగా కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల నుంచి లెక్కింపు పర్యవేక్షకులను, సహాయకులను నియమించాలన్న ఈసీ నిర్ణయంలో ఎలాంటి చట్టవిరుద్ధత లేదని పేర్కొంటూ టీఎంసీ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆ పిటిషన్‌ను ఏప్రిల్ 30న కోల్?కతా హైకోర్టు కొట్టివేసింది. దీంతో మమత సుప్రీం ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది.

**మమతకు న్యాయపరమైన దెబ్బ!**

మరోవైపు, మమతా దాఖలు చేసిన పిటిషన్?ను కోర్టు తోసిపుచ్చడంపై బీజేపీ స్పందించింది. కోర్టు నిర్ణయం మమతా బెనర్జీకి న్యాయపరమైన ఎదురుదెబ్బ అని బీజేపీ సీనియర్? నాయకుడు అమిత్? మాల్వీయా పేర్కొన్నారు. అయితే, మాల్వీయా వ్యాఖ్యలపై టీఎంసీ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

**మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ– వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు**

కాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. అయితే, మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో మరో కీలక పరిణామం జరిగింది. అయితే, బంగాల్?లోని రెండు నియోజక వర్గాల్లో ఎన్నికల అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మళ్లీ ఎన్నికలు (రీపోలింగ్?) నిర్వహించారు ఈసీ అధికారులు. మగ్రాహాట్? పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, డైమండ్ హార్బర్?లోని 4 బూత్?ల్లో రీపోలింగ్ నిర్వహించారు. ఈ రీపోలింగ్? ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని ఈసీ తెలిపింది.

# రికార్డు స్థాయిలో దాడులు పెరిగాయ్- అరెస్టులు తగ్గాయ్

కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రైడ్స్‌తో ముడిపడిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. 2025 – 2026 ఆర్థిక సంవత్సరంలో మనీలాండరింగ్ కేసులతో ముడిపడిన ఈడీ సోదాల సంఖ్య డబుల్ అయ్యి 2,892కు పెరగగా, అరెస్టులు మాత్రం 27 శాతం తగ్గి 156కు చేరాయి. ఇక దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని రీతిలో అత్యంత భారీగా రూ.81వేల కోట్లకుపైగా విలువ చేసే ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ 2025 – 2026 వార్షిక నివేదికలో ఈ వివరాలను ప్రస్తావించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్యకాలంలో తాము దర్యాప్తు చేసిన మనీలాండరింగ్ కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు.

ఈడీ వార్షిక నివేదికలోని కీలక అంశాలివీ

2025–2026 ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ అధికారులు అత్యధికంగా 2,892 రైడ్స్ చేశారు. అంతకుముందు సంవత్సరంలో చేసిన రైడ్స్ సంఖ్య 1,491 మాత్రమే. 2024 – 2025 ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో 214 మందిని ఈడీ అరెస్టు చేయగా, 2025–2026లో 156 మందిని అరెస్టు చేసింది. ఈ లెక్కన అరెస్టులు 27 శాతం తగ్గాయి. అంతక్రితం 2023 – 2024లో అత్యధికంగా 272 మంది ఈడీ అరెస్టు చేసింది.

పక్కా ఆధారాలు లభించిన మనీ లాండరింగ్ కేసుల్లోనే అరెస్టులు చేస్తున్నామని, అందుకే అరెస్టులు తగ్గాయని వార్షిక నివేదికలో ఈడీ ప్రస్తావించింది. 2025–2026లో తమ ఉన్నతాధికారుల నుంచి అందిన 712 ఆదేశాల అమలులో భాగంగానే రూ.81,422 కోట్లు విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్‌మెంట్ చేశామని ఈడీ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తుల అటాచ్‌మెంట్‌లు 171 శాతం పెరిగాయని పేర్కొంది. 2024 – 2025లో ఉన్నతాధికారులు జారీచేసిన 461 ఆదేశాల అమలులో భాగంగా రూ.30,036 కోట్లు విలువైన ఆస్తులను అటాచ్ చేశామని ఈడీ తెలిపింది. 2025–2026లో రూ.32,678 కోట్లు విలువైన ఆస్తులను ఆయా కేసుల్లో మోసపోయిన వారు, బాధితుల కోసం ఈడీ పునరుద్ధరించింది. రిలీజైన ఈ ఆస్తుల్లో రూ.15,582 కోట్లు విలువైనవి పెర్ల్స్ అగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్ (ౡాజూ)తో ముడిపడిన పోంజీ కేసుకు సంబంధించినవే కావడం గమనార్హం. మనీలాండరింగ్ కేసుల బాధితుల్లో ఇళ్ల కొనుగోలుదారులు, బ్యాంకులు, ఇన్వెస్టర్లు ఉన్నారు. 2024–2025లో కేవలం రూ.15,263 కోట్ల ఆస్తులనే ఈడీ పునరుద్ధరించి బాధితులకు అందించింది. 2025–2026లో రూ.15వేల కోట్లు విలువైన ఆస్తుల పునరుద్ధరణ లక్ష్యాన్నే ఈడీ పెట్టుకోగా, అంతకంటే రెట్టింపు రేంజులో పునరుద్ధరించడం గమనార్హం.

**ఈడీ కేసుల లైఫ్ సైకిల్ తగ్గుముఖం**

రైడ్స్ నిర్వహించే క్రమంలో తాము కేవలం ప్రత్యక్ష సోదాలపైనే ఆధారపడటం లేదని ఈడీ స్పష్టం చేసింది. రైడ్స్‌ను ఎదుర్కొనే వారి నుంచి లభ్యమయ్యే ఆర్థిక సమాచారాన్ని మూడు మార్గాల్లో తనిఖీ చేస్తున్నట్లు చెప్పింది. ఇందుకోసం వివిధ డేటాబేస్‌ల నుంచి కీలక సమాచారాలను సేకరిస్తున్నామని తెలిపింది. బ్లాక్ చైన్ అనలిటిక్స్ ద్వారా క్రిప్టో కరెన్సీ లావాదేవీల వివరాలనూ కూడగడుతున్నామని వెల్లడించింది. కార్పొరేట్, ఆస్తి వ్యవహారాలతో ముడిపడిన రికార్డులనూ లైవ్‌లో తనిఖీ చేస్తున్నామని పేర్కొంది.

మనీ లాండరింగ్ కేసుల సమగ్ర సమాచారం ఉండబట్టే 2025–2026లో 812 ఛార్జ్‌షీట్‌లను కోర్టుల ఎదుట దాఖలు చేయగలిగామని ఈడీ చెప్పింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో 457 ఛార్జ్‌షీట్‌లనే దాఖలు చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఎఫ్ఐఆర్ నమోదు తేదీ నుంచి తుది తీర్పు వెలువడే వరకు ఉండే వ్యవధిని నిర్దిష్ట కేసుకు చెందిన లైఫ్ సైకిల్ అంటారు. తమ కేసుల సగటు లైఫ్ సైకిల్ ఇంతకుముందు 3 నుంచి 4 ఏళ్లు ఉండేదని, దీన్ని 1 నుంచి ఒకటిన్నర ఏళ్లకు తగ్గించామని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ కేసు దర్యాప్తును మొదలుపెట్టే ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్ – జుజ×=)ను ఈడీ నమోదు చేస్తుంది. ఈ విధంగా ఈసీఐఆర్ ప్రాతిపదికన నమోదైన మనీలాండరింగ్ కేసుల సంఖ్య 39 శాతం పెరిగి 1,080కి చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈసీఐఆర్‌లతో నమోదైన కేసుల సంఖ్య 775 మాత్రమే.

**విదేశాలకు ఈడీ విన్నపాల లెక్క ఇదీ**

మనీ లాండరింగ్ కేసుతో సంబంధాలున్న ఎవరైనా వ్యక్తి విదేశంలో ఉంటే, ఆ దేశంలోని కోర్టు ద్వారా అతడిని విచారణ పరిధిలోకి తీసుకొచ్చేందుకు లెటర్స్ రొగేటరీ(ౡ=)ని ఈడీ వాడుకుంటుంది. ఇందులో భాగంగా కేసు దర్యాప్తులో న్యాయ సహాయాన్ని కోరుతూ భారత్‌లోని ఒక కోర్టు ద్వారా విదేశంలోని మరొక కోర్టుకు లెటర్స్ రొగేటరీ అనే విన్నపాన్ని పంపిస్తుంది. ఈ వ్యవహారం రెండు దేశాల కోర్టుల మధ్యే నడుస్తుంది. ఇక ఎంఎల్ఏటీ అంటే మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ట్రీటీ. నేర దర్యాప్తునకు సంబంధించిన కేసుల్లో సమాచారాన్ని, ఆధారాలను ఇచ్చి పుచ్చుకునేందుకు రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఎంఎల్ఏటీ అంటారు. దీని ద్వారా నేరగాళ్లను పట్టుకోవడంలో ఇరుదేశాలు నేరుగా సహాయ సహకారాలను అందించుకుంటాయి. 2025–2026లో మనీ లాండరింగ్ కేసుల్లో వివిధ దేశాలకు ఈడీ మొత్తం 353 లెటర్స్ రొగేటరీ, ఎంఎల్ఏటీ విన్నపాలను పంపింది. వీటిలో అత్యధికంగా 69 విన్నపాలు (19.6 శాతం) యూఏఈలోనే పెండింగ్ దశలో ఉన్నాయి. సింగపూర్‌లో 55, యూకేలో 39, హాంకాంగ్‌లో 36, అమెరికాలో 26, స్విట్జర్లాండ్‌లో 23, మారిషస్‌లో 15 విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. 2025–2026లో వివిధ దేశాల నుంచీ ఈడీకి ఇలాంటి 246 విన్నపాలు అందాయి. వీటిలో అత్యధికంగా 79 విన్నపాలు (32.9 శాతం) యూకే నుంచి, సింగపూర్ నుంచి 33, అమెరికా నుంచి 32, ఫ్రాన్స్ నుంచి 7 విన్నపాలు అందాయి.

## ఇకపై విపత్తు సమయాల్లో అలెర్ట్ మెసేజ్

భవిష్యత్‌లో ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రభావిత ప్రాంతాల పౌరులను కేంద్ర ప్రభుత్వం క్షణాల వ్యవధిలోనే అప్రమత్తం చేయనుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పూర్తి స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పరీక్షించింది. అందులో భాగంగా ప్రజల ఫోన్లకు డమ్మీ ఎమర్జెన్సీ మెసేజ్?ను పంపించింది. ఉదయం 11:46 నిమిషాలకు ఫోన్?లకు పెద్ద శబ్దం లేదా వైబ్రేషన్?తో అత్యవసర హెచ్చరిక నోటిఫికేషన్ వచ్చింది. డిస్‌ప్లేపై అలర్ట్ మెసేజ్ ప్రత్యక్షమైంది. అయితే ఇది పరీక్ష మాత్రమేనని, ఎవరూ భయపడొద్దని అధికారులు ఆ సందేశంలోనే వివరించారు. ఈ సందేశం ఇంగ్లీష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో కూడా వచ్చింది. అలర్ట్? మెసేజ్? వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదని భారతీయ టెలీ కమ్యూనికేషన్ శాఖ ఎక్స్?లో పోస్ట్? చేసింది. ‘మీ ఫోన్స్?కు ఏదైనా అలర్ట్ మెసేజ్? వస్తే ఆందోళన చెందవద్దు. విపత్తుల సమయంలో కచ్చితమైన సమాచారం సకాలంలో తెలిపేలా చేయడం కోసం చేపట్టిన అత్యవసర హెచ్చరిక వ్యవస్థ. దానిని పరీక్షించడంలో భాగంగానే వచ్చింది’ అని డోంట్ పానిక్ అని వీడియోను పోస్ట్? చేసింది. అయితే ఈ ఎమర్జెన్సీ అలర్ట్ గురించి ముందుగానే మెసేజ్?లు వచ్చాయి. మే 2న హెచ్చరికలు వస్తాయని, ఎవరూ భయాందోళలను చెందాల్సిన అవసరం లేదని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనిని టెలీ కమ్యూనికేషన్ శాఖ (డీఓటీ), జాతీయవిపత్తు నిర్వహణ సంస్థ(ఎన్?డీఎంఏ) కలిసి ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఇది సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ–డాట్) రూపొందించిన ‘ౡాజఎజు’ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించి ఉంది. సాధారణ ఎస్?ఎంఎస్?లతో పోలిస్తే సెల్? బ్రాడ్?కాస్ట్ హెచ్చరికలు ఒక ప్రాంతంలోని అన్ని మొబైల్‌లకు ఒకేసారి సందేశం చేరుతుంది. దీనివల్ల టెలికాం నెట్‌వర్క్‌లపై అధిక భారం పడకుండా వేగవంతమైన, విస్తృతమైన కవరేజ్ లభిస్తుంది. నెట్‌వర్క్ బిజీ అయినా కూడా పని చేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఈ టెక్నాలజీ ద్వారా వెంటనే హెచ్చరికలు అందించవచ్చు. భూకంపాలు, సునామీలు, మెరుపులు, గ్యాస్ లీకులు, రసాయన ప్రమాదాలు వంటి సమయాల్లో ప్రజలకు వేగంగా సమాచారం అందిస్తుంది.

**పలుమార్లు అలర్ట్ మెసేజ్**

వేర్వేరు మొబైల్ టవర్స్ ఈ వ్యవస్థను పరీక్షిస్తారు. అందువల్ల ఈ హెచ్చరికలు ఒకటి కంటే ఎక్కువసార్లు రావొచ్చని అధికారులు పేర్కొన్నారు. అలా వచ్చినప్పుడు ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశాన్ని అందుకున్న ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది కేవలం దేశవ్యాప్తంగా అమలు చేయనున్న ఆధునిక విపత్తు హెచ్చరిక వ్యవస్థకు సంబంధించిన పరీక్ష మాత్రమే. టెస్టింగ్ పూర్తయ్యాక, ఈ వ్యవస్థ అధికారికంగా ప్రారంభమవుతుంది. అప్పుడు నిజమైన విపత్తుల సమయంలో కేవలం కొన్ని సెకన్లలోనే ప్రభావిత ప్రాంతంలోని ప్రజలకు హెచ్చరికలు చేరతాయి. అయితే గతంలో కూడా ఈ అలర్ట్ మెసేజ్?లు వచ్చాయి. 2023 సెప్టెంబర్? 21వ తేదీన పాన్ ఇండియా ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్ పేరిట మెసేజ్?లు పంపించింది. అప్పుడు కూడా అలర్ట్ మెసేజ్?లని, వాటిని పట్టించుకోవద్దంటూ తెలిపింది. సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ అలర్ట్‌లు ఎనేబుల్ చేయబడిన మొబైల్ ఫోన్‌లలో మాత్రమే టెస్ట్ సందేశాలు అందుతాయి. వినియోగదారులు ఈ సెట్టింగ్‌లను ఈ విధంగా మార్చుకోవచ్చు: సెట్టింగ్స్, ఆ తర్వాత సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ, ఆ తర్వాత వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్స్, ఆ తర్వాత టెస్ట్ అలర్ట్స్ లోకి వెళ్లి ఈ అలర్ట్‌లను ఆన్? లేదా ఆఫ్? చేయొచ్చు.

## బంగాల్‌లో 77 మంది పోలీసు అబ్జర్వర్ల నియామకం



బంగాల్‌లో మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కీలక చర్యలు చేపట్టింది. బంగాల్ వ్యాప్తంగా ఉన్న కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, శాంతి భద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 165 మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లను, 77 మంది పోలీసు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ శనివారం తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగాజరిగేలా చూడడమే లక్ష్యంగా ఈ అదనపు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్? 324, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 20బీ కింద తమకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అబ్జర్వర్లు డెప్యుటేషన్ పద్ధతిలో తమ నియంత్రణ, పర్యవేక్షణలో పనిచేస్తారని ఈసీ పేర్కొంది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న 165 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కౌంటింగ్ అబ్జర్వర్లకు సాయం చేసేందుకు ఈ అదనపు అధికారులను నియమించినట్లు పోల్ ప్యానల్ వివరించింది. “పోలీసు అబ్జర్వర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసు అబ్జర్వర్లు ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ హాల్?లోకి ప్రవేశించరు. వీరు కౌంటింగ్ అబ్జర్వర్లతో, లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే ఇతర ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు” అని ఈసీ స్పష్టం చేసింది.

**గుర్తింపు కార్డులు మస్ట్**

ఇక రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ), కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్ల కోసం గుర్తింపు కార్డులను జుజ×చీవ్ లోని ప్రత్యేక మాడ్యూల్ ద్వారా ఆర్ఓ జారీ చేస్తారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన క్యూఆర్ కోట్ ఆధారిత ఫొటో ఐడీ ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని, లేకుండా లోపలకు వెళ్లడం కుదరదని స్పష్టం చేసింది.

కౌంటింగ్ అబ్జర్వర్, రిటర్నింగ్ ఆఫీసర్ మినహా మరెవరూ కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని ఈసీ తేల్చిచెప్పింది. “కంట్రోల్ యూనిట్లలో కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు లెక్కింపు ఫలితాలు ఉండే ఫారమ్ 17సీ–××ని సిద్ధం చేస్తారు. కౌంటింగ్ ఏజెంట్లకు వాటిని చూపిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు కోరుకుంటే ఈ ప్రక్రియను మళ్లీ పునరావృతం చేస్తారు. ప్రతి టేబుల్ వద్ద ఉండే మైక్రో–అబ్జర్వర్లు కూడా కంట్రోల్? యూనిట్ డిస్‌ప్లేలో కనిపించే ఫలితాలను వేరుగా నోట్ చేసుకుంటారు. వారు క్రాస్ వెరిఫికేషన్ కోసం ప్రతి రౌండ్ చివరలో ఆ వివరాలను కౌంటింగ్ అబ్జర్వర్లకు అందజేస్తారు” అని ఈసీ పేర్కొంది.

**టీఎంసీ బెదిరింపులు– ప్రజల నిరసనలు**

బంగాల్‌లో ఓట్ల లెక్కింపు తర్వాత తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ 24 పరగణా జిల్లా ఫాల్టాలో శనివారం వందలాది మంది గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఆ ప్రాంతంలో టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణహాని ఉందని వారు ఆరోపించారు. నిరసనకారులలో అధిక శాతం మహిళలు పాల్గొన్నారు. వారు బీజేపీ జెండాలను పట్టుకొని హసిమ్?నగర్? గ్రామంలో రహదారిని దిగ్బంధించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత తమపై దాడులు చేస్తామని టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ సన్నిహితుడు, స్థానిక పంచాయతీ ప్రధాన్ ఇస్రాఫిల్? బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనితో సీఆర్?పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్? భారీ బలగాలతో ఆ ప్రాంతాన్ని సందర్శించి, ప్రజలకు తగు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ మహిళా మోర్చాకు చెందిన ఫాతిమా బీబీ మాట్లాడుతూ, “ఇస్రాఫిల్, అతని అనుచరులు ఏప్రిల్ 30 నుంచి మా ప్రాంతానికి వచ్చి, మే 5 నుంచి రక్తపాతం జరుగుతుందని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అందుకే మా ప్రాంతంలో సీఆర్?పీఎఫ్? బలగాలు కొనసాగాలని మేము డిమాండ్ చేస్తున్నాం” అని అన్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను జహంగీర్ ఖాన్ తోసిపుచ్చారు. కౌంటింగ్?కు ముందు టీఎంసీ మద్దతుదారుల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి, తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయించే కుట్రలో భాగంగా బీజేపీ ఈ మహిళలను నిరసనకు పంపిందని ఆయన విమర్శించారు. ఒక వేళ తనపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైనతే, చట్టపరమైన చర్యలకు బాధ్యత ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

తీన్మార్

# ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి.ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి.ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

# అక్షరాలా నిప్పుల కొలిమి



ప్రతియేటా ఇంచుమించు మే నెల మొదటి వారానికిగానీ ఉగ్రరూపం దాల్చని మార్తాండుడు ఈసారి ఫిబ్రవరి నెలాఖరునాటికే చెలరేగడం మొదలెట్టాడు. ముందే రావటం, దీర్ఘకాలం తిష్టవేయటం కొన్నాళ్లుగా కనబడుతున్నా ఈ స్థాయిలో ఎండలు మండిపోవటం ఇదే తొలిసారి. మన దేశంలో రుతువులు గతి తప్పి చాన్నాళ్లయింది. గతంలో పొద్దుటిపూట ఒక రకం, రాత్రికి మరో రకం వాతావరణం దర్శనమిచ్చేవి. ఎంత ఎండాకాలమైనా రాత్రికి ఎటునుంచో వచ్చి చల్లని గాలులు తాకేవి. సేదతీర్చేవి. ఇప్పుడు రాత్రింబగళ్లు తేడా లేదు. వేడిగాలుల వెనకే హఠాత్తుగా వాతావరణం మారి, జల్లులు మొదలై వడగళ్లు పడటం రివాజుగా మారింది. అటు తర్వాత కాసేపటికే ఉక్కబోత మొదలవుతోంది. ప్రకృతికి సంబంధించినంతవరకూ ఉత్తర దక్షిణాలన్న తేడా... మధ్య, పశ్చిమ భారత్‌లన్న వ్యత్యాసం లేదు. వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నదాన్నిబట్టి ప్రస్తుతం 23 రాష్ట్రాలకు వడగాడ్పుల తాకిడి ఉంది. అందులో డజనుకుపైగా తీవ్ర వడగాడ్పులను చవిచూస్తున్నాయి.

వందలాది నగరాలు భరించలేనంత ఉక్కబోతతో విలవిల్లాడుతున్నాయి. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలూ ఇప్పటికైతే ఈ సమస్యకు దూరంగా ఉంటున్నాయి. కానీ పర్యావరణంలో వస్తున్న మార్పుల పర్యవసానంగా భవిష్యత్తులో ఇవి సైతం భానుడి ప్రతాపాన్ని చవిచూడకతప్పదని వాతావరణ శాస్త్రవేత్తలు జోస్యం చెబుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలకన్నా కనీసం 5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువుంటే, అది వరసగా రెండ్రోజులు కొనసాగితే వడగాడ్పులు వీస్తున్నట్టు లెక్కేస్తారు. అది 7 డిగ్రీల సెల్సియస్‌కి మించి పెరిగితే తీవ్ర వడగాడ్పులుగా పరిగణిస్తారు. ఒక ప్రాంతం మైదానమా, కొండలతో ఉందా అనే అంశాన్ని కూడా ఈ విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు. బొంబాయి ఐఐటీ ఇటీవల చేసిన అధ్యయనంలో గంగా--సింధు మైదానం (ఉత్తర భారతం)లో వేడిగాలులకు స్థానిక నేలలు, ఇతర వాతావరణ పరిస్థితులు కారణమని తేల్చింది. వెలుపలినుంచి వచ్చే వేడిగాలులే ఇందుకు దోహదపడుతున్నాయన్న అభిప్రాయాన్ని తోసిపుచ్చింది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరగడంతో వేడిగాలులు భూ ఉపరితలానికి దగ్గరగా ఉండిపోతున్నాయి. నగరాల్లోని కాంక్రీట్ కట్టడాలు, తారురోడ్లు పగలంతా తీవ్ర ఉష్ణోగ్రతను స్వీకరించి, రాత్రికి సైతం సెగలు కక్కుతూనేవుంటున్నాయి. అందుకే ఇంతచేటు తీవ్రత! వరదలు, తుపానులు, భూకంపాల్లాగే వడగాడ్పులు కూడా ప్రకృతి వైపరీత్యమే. కానీ ప్రభుత్వాలు ఒప్పుకోవు. వడగాడ్పులవల్ల ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నా, ఆ విధంగా లెక్కేయటానికి తగిన విధానం రూపొందలేదు. సాధారణంగా శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా అంతకన్నా ఎక్కువకు చేరి, శరీరంలో చెమట పట్టడం ఆగిపోయి చర్మం పొడిబారి ఎర్రగా మారితే, స్పృహ కోల్పోవటం లేదా మతిస్థిమితం తప్పడం, మూర్ఛరావడం వంటివి కనబడితే వడగాడ్పు మరణమని చెబుతారు. వీటికితోడు బాధితుడున్న ప్రాంతంలో వడగాలుల హెచ్చరిక ఉందా, అతను మరణించటానికి ముందు ఎండలో పనిచేశాడా లేదా అనేవి కూడా చూస్తారు. ఆ తర్వాతే వడగాడ్పు మరణంగా నిర్ధారిస్తారు. గుండెజబ్బు వగైరాలున్నా, వృద్ధాప్యంలో ఉన్నా ఆ జాబితాలో లెక్కేయరు. ఈ విషయంలో ప్రభుత్వాల వైఖరి మారాలి. వేసవిలో మరణాల రేటు గత కొన్నేళ్లలో ఎలావుందో చూసే విధానాన్ని అంతర్జాతీయంగా అనుసరిస్తున్నప్పుడు మనం మాత్రం ఎందుకు ఆ కొలమానాన్ని తీసుకోవటం లేదు? పదహారో ఆర్థిక సంఘం నిరుడు ఇచ్చిన నివేదికలో వడగాడ్పుల్ని, పిడుగుపాటుల్ని కూడా ప్రకృతి విపత్తులుగా పరిగణించాలని కోరింది. చాలా రాష్ట్రాలు ఎన్నో ఏళ్లుగా ఈ విషయంలో డిమాండ్ చేస్తున్నాయి. అలా లెక్కేస్తే అందుకు సంబంధించిన నిధుల్ని సహాయ కార్యక్రమాల కోసం వ్యయం చేయటానికి, బాధితులకు తక్షణ సాయం అందించటానికి వీలవుతుంది. వడగాడ్పులున్న ప్రాంతాల్లో భవన నిర్మాణం, సాగుపనుల సమయాలను మార్చటానికి, విద్యాసంస్థలు, కార్యాలయాల పనివేళల్ని సవరించటానికి వీలవుతుంది. అందుకే ప్రభుత్వాలు తక్షణం కదలాలి. అవసరమైన కార్యాచరణ రూపొందించాలి. జనం ప్రాణాలు కాపాడాలి.

# ఎవరి లెక్క ఎంత?



2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇది కేవలం ఒక రాజకీయమైన ఘట్టంగా చూడలేం. ఇది ఆర్థిక స్వరూపాన్ని విస్తారంగా పునర్‌నిర్మించిన కీలకమైన పరిణామంగా భావించవచ్చు. విభజన అనేది దశాబ్దాల ఖజానా అసమతుల్యతలను, ప్రాంతీయ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసింది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ స్వరూప ముసుగులో వ్యవస్థీకృతమైన పరాధీనతను బయటపెట్టింది. ఎప్పుడైతే విభజన జరిగిందో అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను బాధిత రాష్ట్రంగా పరిగణిస్తూ వరాల జల్లు కురిపించింది.. ఆర్థిక సహకారం కూడా అందించింది.తెలంగాణ వార్తలు తెలంగాణ రాష్ట్రాన్ని మాత్రం సొంత కాళ్లపై నిలబడాల్సిన అనివార్యమైన పరిస్థితిలో వదిలిపెట్టింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే గొప్ప బహుమతి అనుకున్నది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత రెండు రాష్ట్రాల ఆర్థిక గమనాన్ని పరిశీలిస్తే, ఖజానా నిర్వహణలో హైదరాబాద్ పాత్ర, రెండు రాష్ట్రాలకు సహకారం అందించడంలో కేంద్రం పారదర్శకత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత ఆంధ్ర ప్రాంత ప్రజలకు హైదరాబాద్ నగరం వివాదాస్పద అంశంగా మారింది. హైదరాబాద్‌తో ఆంధ్రుల బంధం తెగిపోయిందని చెప్పవచ్చు. వాస్తవానికి ఆంధ్ర ప్రాంతానికి హైదరాబాద్ రాజ్యంతో పరిసర సంబంధం అనుబంధం 1780-1800 సంవత్సరాల మధ్య ముగిసింది. సర్కార్ (కోస్తాంధ్ర) ప్రాంతాన్ని, రాయలసీమ జిల్లాలు (సీడెడ్) ప్రాంతాన్ని నిజాం పాలకులు బ్రిటిష్ పాలకులకు అప్పగించారు. 1953 సంవత్సరానికి ముందు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మద్రాస్ ప్రెసిడెన్సీ, మద్రాస్ రాష్ట్రంలో 150 ఏండ్లపాటు ఉన్నాయి. అయితే 1591లో హైదరాబాద్ సంస్థానం ఏర్పడినప్పటి నుంచి 1948 వరకు హైదరాబాద్ నగరమే రాజధాని. ఇది తెలంగాణ నగరానికి నడిమధ్యన ఉన్నది. ఆంధ్రా సరిహద్దు ప్రాంతానికి హైదరాబాద్ 250 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. స్వాతంత్ర్యం అనంతరం 1953లో తొలిసారి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి, కర్నూల్ రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పొరపాటు నిర్ణయం, చారిత్రక తప్పిదం అని అనతికాలంలో తేలింది. ఎందుకంటే ఆంధ్ర ప్రాంతం ఆర్థికంగా బలహీనమైనది. మద్రాస్ రాష్ట్రంపై ఆధారపడి ఉండేది. కానీ స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయింది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఇదే సమయంలో ఆంధ్రా ప్రాంత కాంగ్రెస్ నేతలు తమకు ఉన్న సత్సంబంధాలను ఆసరాగా చేసుకొని హైదరాబాద్ రాష్ట్రంతో విలీనం కోసం కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలను ప్రభావితం చేశారు. కేంద్రం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటు చేయగా ఆంధ్రతో కలిసేందుకు తెలంగాణ ప్రజలు వ్యతిరేకించారు. ప్రజల అభీష్టాన్ని పరిగణలోకి తీసుకోకుండానే 1956లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసింది. పెద్దఎత్తున అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను రాజధానిగా చేయడం ద్వారా తెలంగాణ ప్రాంత మిగులు బడ్జెట్‌తో ఆంధ్ర ప్రాంతానికి ఉన్న ఆర్థిక సమస్యలు తీరుతాయనేది విలీనం ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల విలీనం తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా జరిగింది. ఈ రెండు ప్రాంతాలు 58 ఏండ్లపాటు కలిసి ఉన్నాయి. మద్రాస్ రాష్ట్రంతో ఆంధ్ర ప్రాంతం కలిసి ఉన్న 160 ఏండ్లతో పోల్చితే 58 ఏండ్లు చాలా తక్కువ. తెలంగాణ, ఆంధ్రతో హైదరాబాద్‌కు ఉన్న సంబంధాన్ని, ఆ ప్రాంతాలపై ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి.. ఈ చారిత్రక నేపథ్యం తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**ఆదాయంలో వాటా, పంపిణీ తీరు**

తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల విలీనం సమయంలో ఆంధ్రరాష్ట్రం రూ.4 కోట్ల లోటు బడ్జెట్‌తో నడుస్తున్నది. అదే సమయంలో తెలంగాణ రూ.కోటి మిగులు బడ్జెట్‌తో ఉన్నది. 1955-56 నాటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ లెక్కల ప్రకారం తెలంగాణ తలసరి ఆదాయం రూ.15.04, ఆంధ్ర తలసరి ఆదాయం రూ.10.53 ఉన్నది. నిష్పత్తిగా చూసుకుంటే 1.43:1.00 అవుతుంది. రెండు రాష్ట్రాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడి, 58 ఏండ్లపాటు కొనసాగినప్పుడు తెలంగాణ ఆదాయం ఉమ్మడి రాష్ట్ర ఖజానాకు ఆసరాగా నిలిచింది. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నిధుల లోటును పూడ్చటానికి ఉపయోగపడింది. తెలంగాణలోని 10 జిల్లాలు, కోస్తాంధ్రలోని 13 జిల్లాల నుంచి వచ్చే ఆదాయం రాష్ట్ర ఆదాయంలో దాదాపు 50 శాతం వాటా ఉండేది. కానీ బడ్జెట్ నుంచి ఖర్చులో మాత్రం అసమానత ఉండేది. మొత్తం రాష్ట్ర ఆదాయంలో తెలంగాణ ప్రాంతానికి 35 శాతం మాత్రమే ఖర్చు చేస్తూ మిగిలిన 65 శాతం మాత్రం ఆంధ్ర ప్రాంతానికి వెచ్చించేవారు. తెలంగాణ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలన్న పెద్ద మనుషుల ఒప్పందం ఉన్నప్పటికీ అది ఆచరణకు నోచుకోలేదు. ఎన్నో ఉద్యమాలు జరిగినప్పటికీ సమైక్య రాష్ట్రంలో పరిస్థితి మారలేదు. రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ తిరిగి స్వరాష్ట్రంగా ఏర్పడే వరకు ఇదే విధమైన నిధుల పంపిణీ కొనసాగింది. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 2014-15 నాటి రెండు రాష్ట్రాల లెక్కలు చూస్తే ఆసక్తికరమైన విషయాలు అర్థమవుతాయి. ఆంధ్రప్రదేశ్ రూ.13,337 కోట్ల లోటుతో ఉండగా, తెలంగాణ రూ.369 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్నది. ఇది రెండు రాష్ట్రాల విలీనం నాటి పరిస్థితిని ప్రతిబింబిస్తున్నది. అంటే సమైక్య రాష్ట్రంలో 58 ఏండ్లపాటు లక్షల కోట్ల రూపాయల తెలంగాణ నిధులను, ఆంధ్ర ప్రాంత లోటును పూడ్చటానికి సమైక్యపాలకులు మళ్లించారన్నమాట. ఇక్కడ మరో విషయం గమనించవచ్చు. తెలంగాణలోని నిధులను తమ ఇష్టానుసారం వాడుకోవచ్చని, వాటిని తరలించుకుపోవడంపైనే దృష్టి పెట్టిన ఆంధ్ర పాలకులు, అక్కడి లోటును పూడ్చటానికి మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా విభజన అనంతరం పరిస్థితిని గమనిస్తే రాష్ట్ర మొత్తం ఆదాయంలో స్టేట్ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ వాటా తెలంగాణలో 75 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 52 శాతం మాత్రమే ఉన్నది.తెలంగాణ వార్తలు

**విభజన తర్వాత ఆర్థిక స్థితిగతులు**

ఆంధ్రప్రదేశ్: 2014-15లో ఏపీకి రూ.13,377 కోట్ల ఆర్థిక లోటు ఉన్నది. ఈ మేరకు కేంద్రం లెక్కలు వేసి రూ.11,500 కోట్లను గ్రాంటుగా ఇచ్చింది. అంతేకాకుండా ఆర్థిక లోటును పూడ్చేందుకు 14వ, 15వ ఆర్థిక సంఘాల ద్వారా రూ.52,000 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులు 2026 వరకు కూడా ఏటా ఏపీకి వస్తున్నాయి. వీటితో పాటు క్రమం తప్పకుండా కేంద్రం నుంచి గ్రాంట్లు అందుతున్నాయి. బడ్జెట్ నిర్వహణలో దూరదృష్టి లేకపోవడం వల్ల 2023-24 నాటికి ఏపీ ఆర్థిక లోటు రూ.38,683కి పెరుగగా, 2014-15లో రూ.1.2 లక్షల కోట్లుగా ఉన్న అప్పు 2023-24 నాటికి రూ.3.1 కోట్లకు పెరిగింది. తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.369 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉండగా 2022-23 నాటికి రూ.5,994 కోట్ల మిగులుకు పెరిగింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, విద్యుత్తు ప్రాజెక్టుల విస్తరణ కోసం చేసిన అప్పులతో 2023-24 బడ్జెట్ సమయానికి మిగులు రూ.779గా ఉన్నది. 2014లో విభజన సమయంలో వారసత్వంగా వచ్చిన అప్పులు సుమారు రూ.80 వేల కోట్లు కాగా, 2023-24 బడ్జెట్ సమయానికి అప్పులు రూ.2.3 కోట్లకు పెరిగాయి. అయితే, ఈ అప్పుల ద్వారా పెట్టిన మూలధన వ్యయం సంపద సృష్టి కోసం వెచ్చించారు. ఇలా చేయడం వల్ల తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమై రాబడి పెరిగింది. తెలంగాణ ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.24,000 కోట్లు నిధులు ఇవ్వాలని నీతి అయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ ఈ సిఫారసు అమలుకు నోచుకోలేదు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఎలాంటి అదనపు నిధులు అందలేదు. కేవలం చట్టబద్ధంగా లభించే పన్నుల వాటాలు, గ్రాంట్స్ మాత్రం అందాయి. ఈ నిధులు కూడా ఏపీతో పోల్చితే చాలా తక్కువ.

**హైదరాబాద్‌తో ఏపీకి ఏంటి సంబంధం?**

విభజన తర్వాత హైదరాబాద్‌ను నష్టపోయామని ఏపీ రాజకీయ నేతలు పదేపదే అన్నారు.. అంటున్నారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం. హైదరాబాద్‌ను ఆంధ్ర నష్టపోయిందా? లేకపోతే సమైక్య రాష్ట్రంలో హైదరాబాద్‌పై ఆధారపడిందా? అనేది ప్రశ్న. హైదరాబాద్ ఎప్పుడూ తెలంగాణలో భాగమే. ఇక హైదరాబాద్‌తో ఆంధ్ర ప్రాంతం సంబంధం 1780-1800 మధ్యనే తెగిపోయింది. హైదరాబాద్ నిధులపై ఆధారపడటం అనేది మెజారిటీ ఆంధ్ర పాలకుల నిర్ణయమే కానీ, అది ఆంధ్ర ప్రాంత ప్రజల హక్కు కాదు. సమైక్య పాలనలో ఆంధ్ర ప్రాంత రాబడులను పెంచుకోవడంపై దృష్టి పెట్టని పాలకులు, తెలంగాణలో ఖర్చు పెట్టకుండా ఆ మిగులు నిధులపై ఆంధ్ర ప్రాంతానికి తరలించటం, వాటిపై ఆధారపడటం పరిపాటిగా మార్చుకున్నారు. ఇదే విషయం విభజన తర్వాత స్పష్టంగా తేలిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత హైదరాబాద్ నిధులు తెలంగాణకు మాత్రమే పరిమితం చేయడం అనేది, సుదీర్ఘ కాలం జరిగిన అన్యాయాన్ని సరిచేయడమే అవుతుంది. అంతేకానీ ఆంధ్ర ప్రజలు హైదరాబాద్‌ను కోల్పోయారని చెప్పడం, తమను తాము బాధితులుగా చిత్రీకరించుకోవడం, ఆంధ్ర ప్రాంత సంపన్నవర్గాల పెద్దల కేంద్రంగా జరిగే రాజకీయాలకు నిదర్శనం. కేంద్రం సహకారం: అసమానత, అన్యాయం విభజన తర్వాత కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు 20 జాతీయ సంస్థలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టును మంజూరు చేసింది. పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణకు 6 సంస్థలు ఇవ్వాలి, కానీ రెండు మాత్రమే పట్టాలెక్కాయి. ఏపీలోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, నిధులు ఇచ్చింది. ట్రిబ్యునల్ అనుమతి లేకుండానే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రజిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చింది. కానీ తెలంగాణలోని 9 జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించినప్పటికీ, నిధులు మంజూరు చేయలేదు.

# ప్రగతి ప్రణాళిక ఆర్భాటమేనా?

**ఉచితాలే ప్రజా ప్రగతి పాలనా..!**

**నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో పథకాలకే పెద్దపీట**

**అప్పుల కుప్పగా మారుతున్న రాష్ట్రం**

**ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల దుస్థితిపై విమర్శల వెల్లువ**

**క్షేత్ర స్థాయిలో వెక్కిరిస్తున్న వాస్తవాలు**




**తెలంగాణ బ్యూరో, మే 02 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సమావేశాలు విమర్శలకు తావిస్తున్నాయి. ప్రభుత్వం భారీ ఎత్తున రంగుల పోస్టర్లు, ఫ్లెక్సీలతో ప్రచార ఆర్భాటం చేస్తుండగా.. క్షేత్రస్థాయిలో అసలైన అభివృద్ధి ఎక్కడని మేధావులు, సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహజ్యోతి), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ (మహాలక్ష్మి) వంటి సంక్షేమ పథకాల అమలును ప్రభుత్వం 'ప్రగతి'గా అభివర్ణిస్తుండటంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల లబ్ధి కోసమే ఈ ఉచితాలను తెరపైకి తెచ్చి, అసలైన అభివృద్ధిని గాలికొదిలేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**అప్పుల పునాదులపై 'ఉచితాల' పంపిణీ**

ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న ఈ ఉచిత పథకాలకు నిధుల సమీకరణపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఖజానాలో తగినన్ని నిల్వలు లేనప్పటికీ, అప్పులు తెచ్చి మరీ ఉచితాలు పంచడం తీవ్రమైన ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యానికి దారితీస్తోందని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. ఒక చేత్తో ప్రజలకు ఉచితాలు ఇస్తూనే, మరో చేత్తో ఆ అప్పులు, వడ్డీలు తీర్చేందుకు నిత్యావసరాల ధరలు, ఫీజులు, పన్నులు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారనే అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇది ప్రగతి ఎంతమాత్రం కాదని, భవిష్యత్ తరాలపై మోపుతున్న మోయలేని భారమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో వెక్కిరిస్తున్న వాస్తవాలు**

నిజమైన ప్రగతి అంటే ఉచితాలు పంచడం కాదని, నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించడమని విద్యావేత్తలు గుర్తుచేస్తున్నారు. కానీ, రాష్ట్రంలో నేటికీ ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు సొంత భావనలు లేక, పిల్లలు కూర్చుడానికి కనీసం బెంచీలు లేకుండా, మానసిక ఉల్లాసానికి కనీస వసతులు లేకుండా  కొనసాగుతున్నాయి.

సొంత భవనాలు లేక, తరగతి గదులే నిద్రించే గదులుగా నిర్వహిస్తున్న పాఠశాలలు ఎన్నో ఉన్నాయి.

విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, సరైన మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి కరవయ్యాయి.

మధ్యాహ్న భోజనం చేయడానికి కూడా కనీస వసతులు లేని పరిస్థితుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భవిష్యత్తును తీర్చిదిద్దే బడుల పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం చెబుతున్న ప్రగతి ఎక్కడ సాధించినట్లని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**పాలకుల విరుద్ధ ప్రయోజనాలే శాపమా?**

ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలు బాగుపడకపోవడానికి పాలకుల, అధికారుల స్వార్థమే కారణమన్న తీవ్ర ఆరోపణలున్నాయి. పలువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, చట్టసభల సభ్యులే స్వయంగా ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లే ప్రైవేటు క్లినిక్‌లు నడుపుతుండటం బహిరంగ రహస్యం. ప్రభుత్వ వ్యవస్థలు బాగుపడితే తమ ప్రైవేటు వ్యాపారాలకు గండి పడుతుందన్న ఉద్దేశ్యంతోనే, ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ బడులు, ఆసుపత్రులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ప్రజల్లో బలంగా నాటుకుపోయాయి.

**సంపద సృష్టి ఏదీ..?**

ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచితాలను నమ్ముకోకుండా, రాష్ట్రంలో సంపద సృష్టించే మార్గాలను అన్వేషించాలని మేధావులు సూచిస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మౌలిక సదుపాయాల కల్పన, పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించినప్పుడే ప్రభుత్వం చెబుతున్న 'ప్రగతి ప్రణాళిక'కు నిజమైన అర్థం ఉంటుందని, లేని పక్షంలో ఈ సమావేశాలు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితమవుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.

**రెడ్డి. శేఖర్**
**ఎడిటర్ ఇన్ చీఫ్**
**తీన్మార్ దినపత్రిక**



## విద్యుత్ ప్రమాదాలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**వ్యవసాయ రైతులు అప్రమత్తంగా ఉండాలి**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జి**

**ములుగు జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**

విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు వ్యవసాయ రైతులు,ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 1వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, టీజీఎన్పీడీసీఎల్ ఎస్ ఈ బిక్షపతి లతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి మాట్లాడుతూ వ్యవసాయ రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల బారీ నుంచి రక్షణ పొందేందుకు తగు జాగ్రత్తలను తూ.చా తప్పకుండా పాటించాలని సూచించారు. వ్యవసాయ రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం,పంపుసెట్లను,విద్యుత్ మోటర్లను,ఇనుప పైపులను, ఫుట్ వాల్ లను ఏమరపాటుగా తాకకూడదని,వాటిలో విద్యుత్ ప్రసారం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని  స్వీయ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను,తెగిపడిన తీగలను, స్టార్టర్ డబ్బాలను ముట్టుకోకూడదని,తెగిపడిన తీగలు



చెట్ల కొమ్మలకు తాకి అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఇంటి ఆవరణలో జి ఐ వైర్ ను ఉపయోగించి తడి బట్టలను ఆరవేయడం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. ముందుగా ఎస్ ఈ బిక్షపతి మాట్లాడుతూ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరి చేయడం అత్యంత ప్రమాదకరమని, వీధి దీపాలను సరి చేసేందుకు ఇతరులు విద్యుత్ స్తం భాలను ఎట్టి పరిస్థితిలో ఎక్కరాదని విద్యుత్ శాఖ సిబ్బంది కి వెంటనే తెలియజేయాలని అన్నారు. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గర్లోని వ్యక్తులు వారిని రక్షించాలని ఆత్రుతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోకూడదని, విద్యుత్ ప్రవహించని వస్తువులతో కరెంట్ షాక్ కు గ్రీన్ వ్యక్తిని వేరు చేయడం సరైన మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, డి ఈ పి నాగేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్ పర్సన్ ఆసియా షహీన్, డి.ఎస్.పి రవీందర్, డిపిఆర్ఓ రఫిక్, డి డబ్ల్యు ఓ ప్రేమలత, ఏటూరు నాగారం డి ఈ ఎన్ పురుషోత్తం, ములుగు ఏడిఈఎన్ వేణుగోపాల్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు పడకల గదుల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష

**మహబూబాబాద్ జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**



శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ డివిజనల్ అధికారి క్రిష్ణవేణి, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, ఈడబ్ల్యూ ఐసి, సంబంధిత అధికారులతో కలిసి రెండు పడకల గదుల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి అందించాలని అందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు, రెండు పడకల గదుల నిర్మాణం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణాలు పూర్తి అయిన వాటిని లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్స్ హౌసింగ్ క్షేత్రస్థాయిలో ఇండ్ల నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి వివిధ దశలవారీగా నిర్మాణంలో ఉన్న ఇండ్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు మంజూరు చేయుటకు సిఫారసు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మంజూరు, బిల్లుల వ్యవహారంలో ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు అడిగినా మరి ఇతర ఇబ్బందులకు గురి చేసిన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు,

ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

**జేఎన్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్**

**మహబూబాబాద్ జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**



విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలువాటు పడి  తమ బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని జేఎన్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మహబూబాబాద్ జేఎన్టీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదక దవ్యాల పై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో మహబూబాబాద్ టౌన్ సిఐ అంజలి, ఎస్సై గడ్డం ఉమ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాల గురించి క్లుప్తంగా  వీడియో మాధ్యమాల ద్వారా వివరించి వారికి అవగాహన కల్పించారు. అదే కాకుండా భవిష్యత్తులో ఎలా జీవనాన్ని కొనసాగించాలి పై చదువులకు ఎలా వెళ్లాలి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దత్తత సహాయ కేంద్రం హెల్ప్ డెస్క్ ప్రారంభం

**మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జి. మల్లేశ్వరి**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దత్తత సహాయ కేంద్రం హెల్ప్ డెస్క్‌ను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు అని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జి. మల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లా మరియు పరిసర ప్రాంతాలలో దత్తత కోరే వారికి సరైన మార్గదర్శకత్వం అందించేందుకు ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లల హక్కులను పరిరక్షిస్తూ, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అధికారికంగా దత్తత ప్రక్రియ ఎలా ఉండాలో తెలియజేయడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. మాతృత్వం ఒక వరమని, ఆ వరానికి నోచుకోని వారు లేదా దత్తత ద్వారా పిల్లలను పొందాలనుకునే వారు




తప్పనిసరిగా అధికారిక విధానాల ద్వారా దత్తత తీసుకోవాలని, ఇందుకోసం ఈ సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, డీసీపీయూ సోషల్ వర్కర్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి, ప్రవీణ్, కళావతి, సాయిరాం, శోభ, శైలజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

**ప్రజలతో మమేకమై అభివృద్ధి సాధించాలి**
**ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి**
**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి**




**ములుగు జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలతో మమేకమై సంపూర్ణ సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్డీవో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరై రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి వివరాలను పి పి టి ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, త్వరలో అమలు చేయబోయే మరిన్ని సంక్షేమ పథకాలకు గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో సమగ్రంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జనగణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26వ తేదీ నుంచి,మే 10వ తేదీ వరకు జరుగుతున్న సెల్ఫ్ ఎన్యునరేషన్ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రూపొందించిన యాక్షన్ ప్లాన్ తో ముందుకు సాగాలని ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకురావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు కొత్త బోర్ వేల్స్ ను వేయడం జరిగిందని, ఆరు పాత బోర్వెల్స్ ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామని, వేసవికాలం దృష్ట్యా ఐదు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 20 వార్డులలోని సమస్యలను స్థానిక కౌన్సిలర్లతో పర్యవేక్షించి పరిశీలించడం జరుగుతుందని వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్, మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం



**హుస్నాబాద్ :** ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ జూమ్ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడిలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడి,డీఎంలు. తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతల జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణీకులకు సంధించి సానుకూలంగా ఉండాలి. ప్రతి డివిజన్ స్థాయి అధికారులను కోరుతున్న సిబ్బందితో వేధింపులు లేకుండా ప్రేమతో సానుకూల దృక్పథంతో పనులు చేయించాలి. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీ గా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలి. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికు లతో సత్సంబంధాలు కలిగి ఉండాలి. మే 17 లోపల మీ మీ డిపోలో, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలి. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ప్లాంటేషన్, పరిశుభ్రత పాటించాలి. 2023 డిసెంబర్ 9 నుండి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం తీసుకు వచ్చాం. ఖమ్మం,మెదక్,రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువా డ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నా యో ఆర్ఎంలు, డిపో మేనేజర్ లు సమీక్షించుకోవాలి. టిక్కెట్ కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోండి, సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయం. ప్రతి రెండవ మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి డిపో మేనేజర్లు ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలి. ఆర్టీసీ డిపో మేనేజర్లు గ్రామ సర్పంచ్ నుండి మొదలు,ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు మెయింటేన్ చేయాలి. ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాక పోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుండి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. పెండింగ్ షాప్ లు ఏవైనా ఉంటే జూన్ వరకు క్లియర్ కావాల్సిందే ఎక్కడెక్కడ పెండింగ్ లో ఉందో చూడండి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలలాలను సమస్యను పరిష్కరించండి. ఆర్టీసీ సమ్మెలో డిమాండ్ చేసిన కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తున్నాం, ఇంకా భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని అన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది



**భద్రాద్రి :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## మెగా రైతు మేళా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేయాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 5, 6,7 తేదీల్లో నిర్వహించే మెగా రైతు మేళా నిర్వహణ ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద మే 4 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల లో భాగంగా ఈనెల 5 6 7 తేదీల్లో జరగనున్న మెగా రైతు మేళా నిర్వహణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి మెగా రైతు మేళా నిర్వహణ ఏర్పాట్లు, సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మే 5, 6,7 తేదీల్లో నిర్వహించే మెగా రైతు మేళా కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రైతులు హాజరవుతారని, కాబట్టి అధికారులు సమన్వయంతో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని సూచించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీలు మెగా రైతు మేళా కార్యక్రమం ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఆర్ అండ్ బి ఈ ఈ సురేష్ బాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



**వరంగల్ జిల్లా, మే 02 (తీన్మార్ న్యూస్):**

వరంగల్ జిల్లా ఎనుమాముల మార్కెట్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని బి. రాజమణి అధ్యక్షతన వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ అభినందనీయమని తెలిపారు. దివ్యాంగులు తమ పరిమితులను దాటుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. గతంలో చదువుకున్న వారికి మాత్రమే వాహనాలు అందించేవారని, ఇప్పుడు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు సంపూర్ణ భరోసా ఇస్తోందని, వారు ఎక్కడా నిరుత్సాహపడవద్దని సూచించారు. దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం పనిచేస్తోందని, త్వరలో ఇందిరమ్మ ఇళ్లను కూడా అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఉపకరణాలు పొందిన దివ్యాంగులకు అభినందనలు తెలియజేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంకా ఉపకరణాలు పొందని వారు తిరిగి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంఘం చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఇంత విస్తృత స్థాయిలో ఉపకరణాల పంపిణీ ఇదే తొలిసారి అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు, విద్య, గృహాలు వంటి రంగాల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తోందని పేర్కొన్నారు. వివాహ ప్రోత్సాహకాలు, బాల భరోసా వంటి పథకాల ద్వారా దివ్యాంగుల జీవితాల్లో వెలుగునింపుతోందని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి. రాజమణి మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇంకా పొందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 26 రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, 7 బ్యాటరీ ఆపరేటెడ్ వీల్‌చైర్లు, 2 ల్యాప్‌టాప్‌లు డిగ్రీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంక్షేమ శాఖ సిబ్బంది, సిడిపివోలు, దివ్యాంగుల కమిటీ సభ్యులు, సంఘాల నాయకులు మరియు పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ఆధునిక కెన్నెల్‌శ్రీ ప్రారంభం.

**మహబూబ్నగర్ :** జిల్లా పోలీస్ శాఖలో స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఆధునిక కెన్నెల్ జిల్లా ఎస్పీ డి.జానకి, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రు మాట్లాడుతూ, నేర నియంత్రణలో స్నిఫర్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేలుడు పదార్థాల గుర్తింపు, అనుమానాస్పద వస్తువుల పరిశీలన వంటి సందర్భాల్లో జాగిలాలు పోలీసులకు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపారు. "సింధు" ఇప్పటికే శిక్షణ పొందిన నైపుణ్యంతో భద్రతా చర్యల్లో కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. సింధు కోసం ఏర్పాటు చేసిన ఈ కెన్నెల్ ను ఆధునిక సదుపాయాలతో నిర్మించామని, ఇందులో శుభ్రత, సరైన గాలి ప్రవాహం, విశ్రాంతి కోసం అనుకూల వాతావరణం, తాగునీరు మరియు శిక్షణకు అవసరమైన వసతులు కల్పించినట్లు ఎస్పీ తెలిపారు.

# బిజినెస్

## టెక్ మహీంద్రా చేతికి కెనడా ఐటీ కంపెనీ




**న్యూఢిల్లీ:** ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా కెనడా కంపెనీ అల్లూరి టెక్నాలజీస్ ఇంక్(అవాంట్)ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా తొలుత 85% వాటాను సొంతం చేసుకోనుంది. ఇందుకు 2.8 కోట్ల కెనడియన్ డాలర్ల(రూ. 171 కోట్లు) వెచ్చించనుంది. మూడేళ్ల తదుపరి మిగిలిన 15% వాటాను ముందుగా నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు టెక్ మహీంద్రా పేర్కొంది. అవాంట్‌తో.. సొంత అనుబంధ కంపెనీ టెక్ మహీంద్రా కన్సల్టింగ్ గ్రూప్(టీఎంసీజీ) వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. తాజా కొనుగోలుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సరవసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో మరింత బలపడే వీలున్నట్లు తెలియజేసింది. 2029 జూన్ 30కల్లా మిగిలిన 15% వాటా సైతం దక్కించుకోనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ద్వారా ఉత్తర అమెరికా మార్కెట్‌లో టెక్ మహీంద్రా తన ఉనికిని మరింత సుస్థిరం చేసుకోనుంది. ముఖ్యంగా అల్లూరి టెక్నాలజీస్‌కు ఉన్న డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ నైపుణ్యం, టెక్ మహీంద్రా గ్లోబల్ నెట్‌వర్క్‌కు తోడవ్వడం వల్ల క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కొత్త ప్రాజెక్టులను చేజిక్కించుకునే అవకాశం ఉంటుంది.

## పోస్టాఫీసు బ్యాంక్‌లో కొత్త అకౌంట్.. జీరో బ్యాలెన్స్‌తో..




కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కొత్త అకౌంట్‌ను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా శక్తికి ఆర్థికంగా మరింత ఊతమిచ్చేందుకు 'స్వయం సహాయక బృందాల పొదుపు ఖాతా'ను ప్రత్యేకంగా ప్రారంభించింది. ఎటువంటి ఛార్జీలు లేని ఈ ఖాతా ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయి.

ఈ ఖాతా ప్రత్యేకతలు ఇవే..

మహిళా సంఘాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఖాతాలో అనేక ఆకర్షణీయమైన ఫీచర్లు ఉన్నాయి.

జీరో బ్యాలెన్స్: ఖాతాలో కనీస నిల్వ ఉంచాల్సిన అవసరం లేదు. దీనిపై ఎలాంటి జరిమానాలు ఉండవు.

పరిమితి: ఈ ఖాతాలో గరిష్టంగా రూ. 2,00,000 వరకు నగదును ఉంచుకోవచ్చు.

ఉచిత సేవలు: నగదు జమ ఉపసంహరణపై ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు. అలాగే, క్యూఆర్ కార్డ్ కూడా ఉచితంగానే అందజేస్తారు. ఖాతా మూసివేతకు కూడా ఎటువంటి ఛార్జీలు లేకపోవడం విశేషం.

# సామాన్యుడిపైకి గ్యాస్ మిస్సైల్

## వాణిజ్య ఎల్‌పీజీ ధర 5 నెలల్లో రూ.1,491 పెంపు

**న్యూఢిల్లీ :** కార్మిక దినోత్సవం రోజున ప్రజలకు కేంద్రంలోని మోదీ సర్కార్ ఊహించని గిఫ్ట్ ఇచ్చింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ఎలా ఉన్నప్పటికీ ప్రజలపై ఎటువంటి ఇంధన భారం మోపబోమని ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు పదేపదే హామీ ఇచ్చిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్లేట్ ఫిరాయించింది. ప్రజలపై గ్యాస్ పిడుగు వేసింది. దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు టిఫిన్ సెంటర్లు ఉపయోగించే వాణిజ్య సిలిండర్‌పై రికార్డు స్థాయిలో మోయలేని భారం మోపింది. 19 కిలోల సిలిండర్‌పై దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఒకేసారి రూ.993 పెంచేసింది. దీంతో ఢిల్లీలో దాని ధర రూ. 3,071.50కి చేరింది. అలాగే 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల ధరలను ఒక్కో బాటిల్‌కు రూ. 549 నుంచి రూ. 810.50కి పెంచింది. 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ (డొమెస్టిక్ ఎల్‌పీజీ) ధర ప్రస్తుతం రూ. 913 కాగా, 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర దానికంటే కొంచెం తక్కువగా ఉంది. అలాగే టెలికం సిగ్నల్ టవర్లు వంటి పారిశ్రామిక వినియోగదారులు వాడే బల్క్ డీజిల్ ధర లీటరుకు రూ. 137 నుంచి రూ. 149కి పెరిగింది. పెట్రోల్ పంపుల వద్ద లభించే లీటరు డీజిల్ ధర రూ. 87.62తో పోలిస్తే ఈ ధరలు ఎక్కువ. అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధనం ధరను కూడా ప్రభుత్వం భారీగా పెంచింది. వాణిజ్య ఎల్‌పీజీ ధర గడచిన 5 నెలల్లో రికార్డు స్థాయిలో రూ. 1,491 పెరిగింది. మార్చి 1 రూ. 28 పెంచగా మార్చి 7న రూ. 114.5 పెంచారు. తాజాగా రికార్డు స్థాయిలో రూ. 993 పెంచుతున్నట్లు ప్రభుత్వ అధీనంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ శుక్రవారం ప్రకటించింది. ఈ పెంపు వల్ల



దేశవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, చిన్న టిఫిన్ సెంటర్ల నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం నేరుగా వినియోగదారుడిపై పడే అవకాశం అధికంగా ఉంది. కాగా , విమానయాన సంస్థలు, వినియోగదారులను కాపాడేం దుకు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు పెరుగుతున్న ప్రపంచ ఇంధన ధరల భారాన్ని భరించాలని నిర్ణయించుకు న్నాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) తెలిపింది. పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల రిటైల్ ధరలు స్థిరంగా ఉండగా అంతర్జాతీయ ధరల అస్థిరత నుండి వినియోగదారులను రక్షించడం, సాధారణ ప్రజలను ప్రభావితం చేసే కీలక ఇంధనాల ధరలలో ఎటువంటి సవరణ జరగలేదని ఐఓసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముడి సరుకుల ఖర్చుల ఆధారంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఏటీఎఫ్ ధరలను సవరిస్తారు.

**ఏటీఎఫ్ ధర 5% పెంపు**

అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధన ధరలను 5 శాతం పెంచారు. వరుసగా ఇది రెండో నెల పెంపు. ప్రభుత్వ రంగ చమురు సంస్థల ప్రకారం భారత్‌లో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయానికి నిలయమైన ఢిల్లీలో అంతర్జాతీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరలను కిలోలీటరుకు 76.55 డాలర్లు లేదా 5.33 శాతం పెంచి 511.86 డాలర్లకు చేర్చారు. మొత్తం వినియోగంలో దాదాపు 90 శాతం వాటా ఉన్న పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు యథాతథంగా ఉన్నాయని ఐఓసీ తెలిపింది.

**డొమెస్టిక్ ఎల్పీజీ యథాతథం**

గృహ వినియోగ వంటగ్యాస్ ధరలు యథాతథంగా ఉన్నాయి. మార్చి 7న చివరిసారిగా ధరలను సవరించారు. అప్పుడు 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 60 పెంచారు. ప్రస్తుతం ఢిల్లీలో ఒక గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 913గా ఉంది. గత ఏడాది మార్చిలో లీటరుకు రూ. 2 తగ్గించిన అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు కూడా స్తంభించిపోయాయి. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.72 కాగా డీజిల్ ధర లీటరుకు రూ. 87.62గా ఉంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం అంతర్జాతీయ బెంచ్‌మార్కులు, మారకపు రేట్లకు అనుగుణంగా నెలవారీగా ఏటీఎఫ్, ఎల్‌పీజీ ధరలను సవరిస్తాయి.

## రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్‌కు బిగ్ డీల్

భారతదేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) సాంకేతికతకు వీలు కల్పించేలా రూపొందించిన వాణిజ్య బొగ్గు గనులను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకు న్నాయి. ఈ మేరకు నాలుగు బొగ్గు గనులకు సంబంధించిన 'కోల్ మైన్ డెవలప్‌మెంట్ అండ్ ప్రొడక్షన్ అగ్రిమెంట్స్' (సీఎంపీడీఏ)పై సంస్థలు సంతకాలు చేశాయి.

**ఎవరికి ఏ గనులు?**

రిలయన్స్ ఇండస్ట్రీస్: ఆంధ్రప్రదేశ్‌లోని రెచెర్ల, చింతలపూడి సెక్టార్ ఏ1 బొగ్గు గనులను సొంతం చేసుకుంది.


యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్: ఒడిశాలోని బెల్పహార్, తంగార్దిహి ఈస్ట్ బొగ్గు గనులను దక్కించుకుంది.

ఈ నాలుగు గనుల్లో రెండు పాక్షికంగా నిర్వహిస్తున్నావి కాగా, మరో రెండు పూర్తిగా కార్యకలాపాలు సాగిస్తున్నవి.

ఏమిటీ యూసీజీ ప్రత్యేకత?

సాధారణంగా బొగ్గును గనుల నుంచి వెలికితీసి ఆపై విద్యుత్ లేదా ఇంధనం కోసం ఉపయోగిస్తారు. అయితే, యూసీజీ సాంకేతికత అందుకు భిన్నం. ఇది బొగ్గును నేరుగా సీమ్ (నేల లోపల బొగ్గు పొర)లోనే సింథటిక్ వాయువు (సిన్‌గ్యాస్)గా మారుస్తుంది. దీనివల్ల





సంప్రదాయ మైనింగ్ అవసరం ఉండదు. సాధారణ పద్ధతుల్లో దీన్ని వెలికితీయడం కష్టసాధ్యం. ఈ పద్ధతి ద్వారా లోతైన బొగ్గు పొరల నుంచి కూడా సింథటిక్ వాయువును తయారు చేయవచ్చు. బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, ఈ గనులలో సాంప్రదాయ మైనింగ్‌తో పాటు యూసీజీ పద్ధతిని కూడా అనుసరించే వెసులుబాటును ఆపరేటర్లకు కల్పించారు. ఇది దేశంలోని ఇంధన వనరులను గణనీయంగా పెంచుతుంది. ఈ ప్రాజెక్టులు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా దేశీయ పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ద్వారా వెలువడే సిన్‌గ్యాస్ యూరియా, అమ్మోనియా తయారీకి కీలకంగా మారుతుంది. ఇది ఎరువుల దిగుమతులపై భారత్‌కున్న ఆధారపడటాన్ని తగ్గించి ఆహార భద్రతకు ఊతమిస్తుంది. కెమికల్స్, పెట్రోకెమికల్స్ తయారీలో సహజ వాయువు, నాఫ్తా స్థానంలో ఈ సిన్‌గ్యాస్‌ను ఉపయోగించి మిథనాల్, డైమిథైల్ ఈథర్ (డీఎంఈ), ఇతర సింథటిక్ ఇంధనాలను స్వదేశంలోనే తయారు చేసే అవకాశం లభిస్తుంది. ఈ నాలుగు ఒప్పందాలతో కలిపి ఇప్పటివరకు వాణిజ్య బొగ్గు వేలం ద్వారా జరిగిన మొత్తం ఒప్పందాల సంఖ్య 138కి చేరుకుంది.

# జీవితంలో ఇంతలా భయపడే రోజు వస్తుందనుకోలేదు

న్యూజిలాండ్ స్టార్, ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైలీ జెమీసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన జీవితంలో పదిహేనేళ్ల పిల్లాడికి కూడా భయపడాల్సిన రోజు వస్తుందని అస్సలు ఊహించలేదన్నాడు. అతడిని అవుట్ చేసేందుకు ఆసీస్ దిగ్గజ పేసర్ మిచెల్ స్టార్క్‌తో చర్చించాల్సి వచ్చిందని పేర్కొన్నాడు.

**36 బంతుల్లోనే శతక్కొట్టాడు**

అవును.. జెమీసన్ చెప్తున్నది రాజస్తాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ గురించే!.. ఐపీఎల్-2026లో ఈ లెఫ్టాండర్ బ్యాటర్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటికే ఈ సీజన్‌లో తన ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు వైభవ్. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో 36 బంతుల్లోనే శతక్కొట్టాడు.

**ఎదురుగా ఎవరున్నా డోంట్ కేర్**

ఇక ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ సందర్భంగా ప్రపంచస్థాయి బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ సిక్సర్లు బాది తన బ్యాట్ పవరేంటో మరోసారి చాటిచెప్పాడు వైభవ్. ఎదురుగా ఎంతటి దిగ్గజ బౌలర్ ఉన్నా బంతిని బాదడమే లక్ష్యంగా పెట్టుకుని పరుగులు పిండుకుంటున్నాడు.

**నేనూ భయపడ్డా**

ఈ నేపథ్యంలో తాను సైతం వైభవ్ సూర్యవంశీ విషయంలో భయపడ్డాడని కివీస్ స్టార్, ఢిల్లీ పేసర్ కైలీ జెమీసన్ అన్నాడు. కాగా శుక్రవారం నాటి మ్యాచ్‌లో ఢిల్లీ రాజస్తాన్‌తో తలపడ్డ సంగతి తెలిసిందే. జైపూర్ వేదికగా టాస్ గెలిచిన రాజస్తాన్.. తొలుత బ్యాటింగ్ చేసింది. అయితే, ప్రతీ మ్యాచ్‌లోనూ అదరగొడుతున్న ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4)లను త్వరగానే వెనక్కి పంపడంలో ఢిల్లీ సఫలమైంది. వైభవ్‌ను జెమీసన్ బౌల్డ్ చేయగా.. జైసూను




మిచెల్ స్టార్క్ పెవిలియన్‌కు పంపాడు.

**ఢిల్లీ గెలుపు**

ఓపెనర్లు విఫలమైనా రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగుల మేర మంచి స్కోరు సాధించింది. ధ్రువ్ జురెల్ (42), డొనోవాన్ ఫెరీరా (14 బంతుల్లో 47 నాటౌట్)లతో పాటు కెప్టెన్ రియాన్ పరాగ్ (50 బంతుల్లో 90) ఇన్నింగ్స్ ఇందుకు కారణం. అయితే, 226 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ అనూహ్య రీతిలో ఊదిపారేసింది. ఓపెనర్లు పాతుమ్ నిస్సాంక (33 బంతుల్లో 62), కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75).. వన్‌డౌన్ బ్యాటర్ నితీశ్ రాణా (17 బంతుల్లో 33) వేగంగా ఆడి పని పూర్తి చేశారు.

**ఇంతలా భయపడే రోజు వస్తుందనుకోలేదు**

ఇదిలా ఉంటే.. వైభవ్ సూర్యవంశీని త్వరగా పెవిలియన్‌కు పంపేలా తాను ముందు నుంచే సన్నద్ధమయ్యాయని జెమీసన్ తాజాగా వెల్లడించాడు. "పదిహేనేళ్ల పిల్లాడికి కూడా ఇంతలా భయపడే రోజు వస్తుందని నా జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. అతడిని అవుట్ చేసేందుకు మేము ఎన్నో వ్యూహాలు, ప్రణాళికలు రచించుకున్నాము. అందుకు తగ్గ ఫలితం వచ్చింది" అని జెమీసన్ చెప్పుకొచ్చాడు. రాజస్తాన్‌కు కీలకమైన ఓపెనింగ్ జోడీని విడదీసేందుకు తానూ, స్టార్క్ ప్లాన్ వేశామని.. అనుకున్నట్లే ఆరంభంలోనే వారిని వెనక్కి పంపామని హర్షం వ్యక్తం చేశాడు. కాగా 15 ఏళ్ల వైభవ్‌ను అవుట్ చేసిన తర్వాత.. 31 ఏళ్ల జెమీసన్ వైల్డ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు. అతడి ముఖంలో ముఖం పెట్టి గట్టిగా అరుస్తూ చప్పట్లు కొట్టాడు. దీంతో బీసీసీఐ జెమీసన్‌ను మందలించడంతో పాటు అతడి ఖాతాలో ఓ డిమెరిట్ పాయింట్ జతచేసింది.

## దుర్గామాత కూడా ఫలితాలను అంచనా వేయలేదు: సౌరవ్ గంగూలీ



**కోల్‌కతా:** ప్రధాని మోదీ కానీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కానీ, బెంగాలీలు పూజించే దుర్గామాత కూడా 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అంచనా వేయలేరని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. మే 4వ తేదీన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరనున్న నేపథ్యంలో ఆయన్ను ప్రశ్న అడగ్గా.. అలాంటి ప్రశ్నలకు తాను ఎలా సమాధానం ఇవ్వగలనన్నారు. సోమవారం బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేసిన తర్వాతే ఆ విషయం తెలుస్తుందన్నారు. అప్పుడే మనకు సమాధానం దొరుకుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఊహాగానాలు పెరిగిపోతున్న నేపథ్యంలో.. మమతా దీదీ కానీ, మోదీజీ కానీ, దుర్గామాతా కానీ వాటిని అంచనా వేయలేరన్నారు. 294 స్థానాలు ఉన్న బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 23, 29వ తేదీల్లో ఆ ఎన్నికలు నిర్వహించారు. ఇక ఇవాళ సౌత్ 24 పరగనాస్ జిల్లాలో 15 పోలింగ్ బూత్‌ల పరిధిలో రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. బెంగాల్ ఎన్నికలకు రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు భారీ స్థాయిలో బందోబస్తు నిర్వహించాయి. తొలి దశ పోలింగ్ 152 స్థానాలు, రెండో దశ 142 స్థానాల్లో జరిగింది. అయితే చాలా వరకు ఎగ్జిట్ పోల్స్ .. బీజేపీకే విజయాన్ని కట్టబెట్టాయి.

# స్పోర్ట్స్

## కోచ్‌లు, సెలక్టర్లు కావలెను! ఉండాల్సిన అర్హతలు ఇవే



గత కొన్నేళ్లుగా దేశవాళీ టోర్నీల్లో సత్తా చాటలేక చతికిలపడుతోంది తమిళనాడు క్రికెట్ జట్టు. ఈ నేపథ్యంలో తమిళనాడు క్రికెట్ సంఘం శిక్షణ బృందాన్ని బలోపేతం చేసే పనిలో పడింది.

వరుస వైఫల్యాలు

కాగా గత రంజీ సీజన్‌లో గ్రూప్ దశలో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న తమిళనాడు జట్టు... సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో సూపర్ లీగ్ దశకు చేరలేకపోయింది. దీంతో కోచింగ్ స్టాఫ్‌ను మార్పు చేయాలని భావించిన తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) కొత్త కోచ్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పురుషుల, మహిళల విభాగాల్లో సీనియర్, జూనియర్ జట్లకు కొత్త కోచ్‌లను నియమించనుంది. అలాగే సెలెక్షన్ కమిటీ సభ్యులను సైతం ఎంపిక చేయనుంది. ఈ నెల 10 దరఖాస్తులకు చివరి తేదీ కాగా... పరిమిత ఓవర్లకు, టెస్టు ఫార్మాట్‌కు వేర్వేరు కోచ్‌లను ఎంపిక చేయనుంది.

ఉండాల్సిన అర్హతలు ఇవే


కాగా 60 సంవత్సరాలకు లోబడి ఉండి బీసీసీఐ లెవల్--2 కోచింగ్ సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని టీఎన్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. 'నిబంధనల ప్రకారం కొత్త కోచ్‌ల నియామకం చేపడతాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తదుపరి పరీక్షలు నిర్వహిస్తాం' అని టీఎన్‌సీఏ కార్యదర్శి భగవాన్ దాస్ తెలిపారు. ప్రస్తుతం తమిళనాడు జట్లకు సెంథిల్‌నాథన్, వెంకటరమణ కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.




## ఆకట్టుకుంటున్న 'సతీ లీలావతి' ట్రైలర్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చాలా కాలం తర్వాత లావణ్య లీడ్ రోల్‌లో కనిపిస్తున్న ఈ చిత్రానికి 'భీమిలీ కబడ్డీ జట్టు', 'హమీా' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించారు. 'శాకుంతలం' ఫేమ్ మలయాళ నటుడు దేవ్ మోహన్ ఇందులో హీరోగా నటించగా, భార్యాభర్తల మధ్య జరిగే సరదా గొడవలు, ఎమోషన్స్‌ను మేళవించి ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా దీనిని తెరకెక్కించారు. ఈ సినిమాను మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ముహూర్తం ఖరారు చేసింది.

## మైండ్ గేమ్‌తో వస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్..
# ఆకట్టుకుంటున్న 'ఐ నోబడీ' టీజర్




మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం (ఐ, నోబడీ). 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.



## వరుస యాక్షన్ చిత్రాలతో గోపిచంద్ దూకుడు..
### మరో యాక్షన్ డ్రామాకి రెడీ..!

టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. కెరీర్‌లో మరోసారి జోరు పెంచిన ఆయన, కొత్త కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న 'భరతవర్ష' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా దృశ్యాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో గోపీచంద్ తన రూపాన్ని పూర్తిగా మార్చుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే సమయంలో, నూతన దర్శకుడు కుమార్ సాయి తో మరో చిత్రానికి కూడా ఆయన అంగీకరించారు. ఈ సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగం విదేశాల్లో జరగనుంది. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక తాజాగా గోపీచంద్ తన జాబితాలో మరో యాక్షన్ కథను చేర్చాడు. ప్రముఖ స్టంట్ మాస్టర్ వెంకట్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ సంగీతం అందించనున్నారు. పలువురు ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగమవుతున్నారు. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవం మే 3న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరగనుంది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం చేతిలో ఉన్న చిత్రాలను పూర్తి చేసిన తర్వాత, గోపీచంద్ ఈ కొత్త యాక్షన్ చిత్ర షూటింగ్‌లో పాల్గొననున్నారు.

## 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు అద్భుతం.. ఆకట్టుకుంటున్న 'సింగ్ గీతం' టీజర్!




భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ఏడీ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

## తిరుపతి ఘటనపై రష్మీ ఆగ్రహం..
### ట్రోలింగ్‌పై గట్టి కౌంటర్ ఇచ్చిన జబర్దస్త్ యాంకరమ్మ



బుల్లితెర, వెండితెరపై తనదైన గుర్తింపు తెచ్చుకున్న రష్మీ గౌతమ్ మరోసారి జంతువులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తరచుగా స్పందించే రష్మీ, ముఖ్యంగా మూగజీవాల సంరక్షణ విషయంలో ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తిరుపతిలో జరిగిన ఒక ఘటనపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్ కొరత సమస్యపై నిరసనల నేపథ్యంలో తిరుపతిలో ఒక ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎద్దుల బండిపై ఆటోను, దానిపై కొంతమంది వ్యక్తులను ఎక్కించి ఎద్దులతో లాగించిన ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, రష్మీ గౌతమ్ తీవ్రంగా స్పందించారు. నిరసన పేరుతో మూగజీవాలపై ఇంత భారం మోపడం క్రూరత్వమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇలాంటి చర్యలు చేసే వారు తమ కర్మ ఫలితాన్ని అనుభవిస్తారు" అంటూ ఘాటుగా హెచ్చరించారు. అలాగే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రష్మీ వ్యాఖ్యలపై కొంతమంది సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. గతంలో ఆమె నటించిన సినిమాలను ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలు చేశారు.



# ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు తీసుకోవడం తప్పు..
### టికెట్ రేట్లపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు!

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ ఈ చిత్రం మే 08న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.



## హారర్ థ్రిల్లర్‌గా నవీన్ చంద్ర 'పోలీస్ కంప్లైంట్'

వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటీనటుల కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'పోలీస్ కంప్లైంట్' మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా హారర్ మరియు యాక్షన్ థ్రిల్లర్ అంశాల కలబోతగా రూపొందడం విశేషం. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ఇచ్చింది. చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు కృష్ణసాయి పుట్టినరోజును పురస్కరించుకుని, దివంగత సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ఒక ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతూనే, ప్రేక్షకులకు వెన్నులో వణుకు పుట్టించే హారర్ ఎలిమెంట్స్ ఇందులో పుష్కలంగా ఉండబోతున్నాయి. గతంలో 'ఆదిపర్వం', 'రాఘవరెడ్డి', 'అఘోర' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న సంజీవ్ మేగోటి, ఈసారి పోలీస్ కంప్లైంట్ సినిమాతో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణ నటీనటుల ఎంపిక. వరలక్ష్మి శరత్‌కుమార్ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సరికొత్త షేడ్స్ చూపించనుండగా, వెర్సటైల్ హీరో నవీన్ చంద్ర ఒక విభిన్నమైన రోల్‌లో మెరవబోతున్నారు. వీరిద్దరి మధ్య సాగే డ్రామా సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కేవలం ప్రధాన జంట మాత్రమే కాకుండా, ఈ చిత్రంలో ఏకంగా 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించడం విశేషం. రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్ వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. భారీ తారాగణం ఉండటం వల్ల సినిమాలోని ప్రతి సన్నివేశం చాలా గ్రాండ్‌గా, పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. సాంకేతిక పరంగా కూడా ఈ చిత్రం ఉన్నత ప్రమాణాలతో రూపొందింది. ముగ్గురు సంగీత దర్శకులు ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి మరియు సుధాకర్ మారియో ఈ చిత్రానికి బాణీలు సమకూర్చగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాధ్యతను స్వయంగా దర్శకుడే తీసుకున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463